# ఖుర్ఆన్ : జీవన కళ



స్వామి లక్ష్మీశంకరాచార్య

# Qur'an : Jeevana Kala

## Qur'an Jeene ka Kala (Hindi)

# ఖుర్ఆన్ - జీవన కళ

హిందీ మూలం

**స్వామి లక్ష్మీశంకరాచార్య**

తెలుగు అనువాదం

**శ్రీమతి రేవూరి ప్రశాంతిమూర్తి**

TRUST

ప్రకాశకులు

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**

**సందేశ భవనం, లక్కడ్‌కోట్,**

**ఛత్తాబజార్, హైదరాబాద్ - 500 002**

# Qur'an : Jeevana Kala

**Qur'an Jeene ka Kala (Hindi)**

**TIP Series No.** : **347**

Writer : **Swami Laxmi Sankaracharya**

Translated by : **Smt. Revoori Prasanti Murthy**

*All Rights Reserved with Publishers*

First Edition : April 2023

Copies : 1000

**Price : Rs. 60/-**

ISBN : 978-93-81111-98-7

Published by : **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 040-24576237, 24564583
E-mail: geeturaiweekly@gmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

## విషయసూచిక

**శుభారంభం** 06

**అధ్యాయం : 1**

ఈ పుస్తకం రాయటంలోని పరమార్థం 07

**అధ్యాయం : 2**

జీవన కళ– ఖుర్ఆన్ 10

**అధ్యాయం- 3**

ఖుర్ఆన్‌లో అహింస 12

కర్మతో అహింస 13

**అధ్యాయం - 4**

ఖుర్ఆన్‌లో మానవత 14

ఖుర్ఆన్ ప్రకారం 'మానవత' పాలిట శత్రువులు ఎవరు? 15

దానధర్మాలు మానవతను మేల్కొల్పుతాయి 15

వడ్డీ తీసుకునేవారు మానవతా విరోధులు 16

విధవలు, అత్యంత పేదరికంలో మగ్గుతున్న బాలికల వివాహం 16

**అధ్యాయం - 5**

ఖుర్ఆన్‌లో యుద్ధం గురించి కాదు, శాంతి గురించిన ఆదేశాలు 17

శత్రుత్వం వద్దు– స్నేహమే ముద్దు 19

దౌర్జన్యం చేసి బాధించువారిని ప్రక్కకు ఉంచుము 19

కక్ష తీర్చుకొనుట కన్నా ఓరిమితో వ్యవహరించటం మిన్న 19

ఇస్లాం కత్తితో కాదు, తనలోని మంచితో వ్యాపించింది 20

**అధ్యాయం - 6**

ఖుర్ఆన్‌లో చెడుపై మంచి ద్వారా విజయం 21

మంచిని పెంపొందిస్తూ చెడును ఆపే సముదాయం 21

మంచి మనిషిగా మారమని ఆజ్ఞ 22

వ్యభిచారం అనే చెడుకు అత్యంత దూరంగా ఉండమని ఆజ్ఞ 23

'క్రోధానికి' దూరంగా ఉండాలన్న ఆదేశం 25

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్

మదం అనగా గర్వం లేక అహంకారానికి దూరంగా ఉండుట 26
పిసినారితనానికి దూరంగా ఉండమని ఆజ్ఞ 27
మోహానికి దూరంగా ఉండమని ఆజ్ఞ 27
దయార్ధ్రతను పెంచుకోమని ఆజ్ఞ 28
వినమ్రత (వినయం) అను సుగుణమునకు మరింత దగ్గర కమ్మని ఆజ్ఞ 28
ధైర్యం అనగా కష్టమును తట్టుకునే ఓర్పు 28
అల్లాహ్ మనందరి కర్మలకు సాక్షి 29

## అధ్యాయం - 7

ఆదర్శ న్యాయ వ్యవస్థ 31
శత్రువుకి కూడా నిజమైన న్యాయం అందించమని ఆజ్ఞ 31
పక్షపాతం చూపకుండా సమన్యాయం అందించు అని ఆజ్ఞ 31
ప్రతీకార న్యాయం 32
దొంగ చేతులు నరుకుము అని ఆజ్ఞ 32
వ్యభిచారం చేయువారికి 100 కొరడా దెబ్బలు కొట్టమని ఆజ్ఞ 32
ఖుర్ఆన్ ప్రకారం ఆస్తి పంపకాలపై ఆజ్ఞ 33

## అధ్యాయం - 8

ఖుర్ఆన్‌లో అనుసరణీయమైన సదాచారాలు 36
ఎవరినీ వేళాకోళం చేయవద్దు, నిందించవద్దు అనే ఆజ్ఞ 36
అనాథలను అన్యాయానికి గురిచేయవద్దు అనే ఆజ్ఞ 36
ఆకలి బాధ అందరికీ తెలిసి రావాలి. అందుకే ఉపవాసం ఆజ్ఞ 38
ద్రోహం చేయకండి 39
ఖుర్ఆన్ ప్రకారం ఎవరైనా నిర్దోషులను శిక్షలో ఇరికించటం పాపం 40
తల్లిదండ్రులతోనూ ఇరుగు పొరుగులతోను సద్వర్తనతో నుండుమని ఆజ్ఞ 40
తల్లిదండ్రులతో సద్వర్తన 40
చెప్పింది, చేయాలి 40
సంతాన హత్య మహాపాపం 41
దుబారా ఖర్చు మంచిది కాదు 41
సత్కార్యాలలో పిసినారితనం నరకమార్గం 41
కొలతలు, తూనికల్లో న్యాయంగా వ్యవహరించాలి 41
తెలియని విషయాల వెంట పడకండి 41
సత్యం ఎప్పుడూ అసత్యం మీద గెలుపు సాధిస్తుంది 42

దైవ సంప్రదాయం 42
లంచగొండితనం 42
మనిషి స్వభావం 42
ఖుర్ఆన్ ప్రకారం ప్రాపంచిక జీవనానికి ఎక్కువ ప్రాముఖ్యత లేదు 43
విర్రవీగేవారిని అల్లాహ్ ఇష్టపడడు 43
ఆడ మగ సంతానం మధ్య తేడా చూపుట అల్లాహ్‌కు అయిష్టం 44
ప్రార్థనా సమయంలో అమ్ముట, కొనుట వంటివి ఆపమని దైవాజ్ఞ 44
మహిళల గౌరవం, మర్యాద నిలిపేది పరదా అని గుర్తెరగమని ఆజ్ఞ 44

**అధ్యాయం - 9**

అల్లాహ్ నియమాలకు కట్టుబడే వారికే స్వర్గ ప్రవేశం 45

**అధ్యాయం - 10**

అల్లాహ్ నియమావళిని ఉల్లంఘిస్తే నరకమే 49

**అధ్యాయం - 11**

ఖుర్ఆన్ ద్వారా ఈ బ్రహ్మాండంలో జీవించే కళ 54
ఆకాశంలో నుండి నీటిని కురిపించటం 56
భూమిపై జీవుల రక్ష కొరకు వాయు మండలానికి పైగా ..... 57
సైన్సు – స్వర్గం 58
కొన్ని కోట్ల సంవత్సరాల తరువాత మనిషి స్వయంగా
స్వర్గానికి చేరుకోగలిగేలా సైన్సు వృద్ధి చెందుతుందా? అనేది ప్రశ్న 62
ప్రళయం (కియామత్) తథ్యం 63

**అధ్యాయం - 12**

అల్లాహ్‌యే గొప్పవాడు (అల్లాహు అక్బర్) 66
ఈశ్వరుడిపై సంపూర్ణ విశ్వాసియై యుండు అని ఆజ్ఞ 68
ఆ సర్వేశ్వరుడైన అల్లాహ్‌ను ఉదయం, సాయంత్రం తప్పక ప్రార్థించమని ఆజ్ఞ 69
ఖుర్ఆన్ ప్రకారం దైవభీతి కలవాడే మంచి వ్యక్తి 69

**అధ్యాయం - 13**

అల్లాహ్ తన దాసుల పేదరికం దూరం చేస్తాడు 70

**అధ్యాయం - 14**

ముగింపు 71

# శుభారంభం

పవిత్ర కుర్ఆన్ శుభారంభం ఆ అనంత కృపాళువైన పరమేశ్వరుని సూరా ఫాతిహా ప్రార్థనచే జరుగుతుంది. అందుచేత ఈ పవిత్ర ఖుర్ఆన్ జీవన కళ అనే పుస్తకాన్ని ఫాతిహా సూరా అనే ఈశ్వర వందన ద్వారానే ప్రారంభిద్దాం.

**అల్లాహ్ మాత్రమే స్తుతింపదగినవాడు. ఆయన సకల లోకాలకు ప్రభువు, అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు, ప్రతిఫల దినానికి స్వామి. మేము నిన్నే ఆరాధిస్తాము, సహాయం కొరకు నిన్నే అర్థిస్తాము. మాకు రుజుమార్గం చూపించు– నీవు అనుగ్రహించిన వారూ, నీ ఆగ్రహానికి గురికానివారూ, మార్గభ్రష్టులు కానివారూ అనుసరించిన మార్గము.** ***(ఖుర్ఆన్ అధ్యాయం 1, 1–7)***

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్

తెలుగు విజ్ఞాన సర్వస్వం ట్రస్ట్

**అధ్యాయం : 1**

# ఈ పుస్తకం రాయటంలోని పరమార్థం

నేటి అమెరికా, ఐరోపాతో సహా మారుతున్న ప్రపంచ రీతులలో, సమాజ రీతులలో చాలా దేశాలలో ఇస్లాం మత సారాన్ని తెలియజేసే పవిత్ర కుర్ఆన్ గ్రంథ పారాయణాన్ని తప్పుగా అర్థం చేసుకుంటూ తప్పుగా జీవన రీతిలో అమలు చేయడం జరుగుతున్నది అన్నది జగమెరిగిన సత్యమే. ఉదాహరణకు ఈ విషయాన్ని గుర్తు చేసుకుందాం– ఇంటర్నెట్‌లో ఒక సజ్జనుడు తెలిపిన విషయం ఏమనగా బ్రిటన్ పూర్వ ప్రధాని శ్రీ విలియం ఎవర్ట్ గ్లాడ్‌స్టోన్ (1809–1989) బ్రిటన్ పార్లమెంట్‌లో పవిత్ర కుర్ఆన్ గ్రంథాన్ని చేతిలో తీసుకుని ఈ విధంగా స్టేట్‌మెంట్ ఇచ్చారు– ఎప్పటివరకు ఈ గ్రంథం ప్రపంచంలో ఉండునో అప్పటి వరకు ప్రపంచ శాంతి అనేది కుదరని పని.

So long as there is this book, there will be no peace in the world.

బ్రిటన్ పూర్వ ప్రధాని చేసిన ఈ ప్రకటన చూసినవారికి అనిపించేది ఏమి టంటే– మన పవిత్ర ఖుర్ఆన్‌ని చదవటంలో, అర్థం చేసుకోవటంలో, ఆచరించ టంలో, ఆదరించటంలో కావల్సిన సులభతర పద్ధతులు చూపించటంలో ఇంకా మనం చేయవలసిన కృషి మిగిలి ఉందనిపించింది. కొంతమంది ముస్లిమ్ సోదర సోదరీమణులు కొన్ని అధ్యాయాలను అర్థం చేసుకోవటంలో విఫలమయ్యారన్న బాధ కలిగింది. ఇట్టి పరిస్థితులలో కుర్ఆన్ పఠనం వలన నకారాత్మక (Negative) ఫలితాలు అందుతున్నాయనేది నిర్వివాదాంశం.

ఇస్లాం ప్రకారం ఖుర్ఆన్ మనందరి పరమ పవిత్ర ఈశ్వరుడైన అల్లాహ్

మన కొరకు సమ్మతించి పంపించిన పవిత్ర గ్రంథరాజం అని చెప్పవచ్చు. దీనిలో మానవులందరి జీవన రీతికి కావలసిన ఆదేశాలు చివరి పైగంబర్ హజ్రత్ ముహమ్మద్ (స) ద్వారా అందజేయటం జరిగింది. జిహాద్ అనగా యుద్ధం అనేమాట ఉపయోగించటంలో అర్థమేమనగా కుర్ఆన్‌లో తెలియజేయబడిన సత్యం శాంతి, అహింస, మానవత అనే ముఖ్య సూత్రాలను రక్షించే నిమిత్తం, పెద్ద హింసను, ఉపద్రవాన్ని ఆపే నిమిత్తం, చిన్న యుద్ధాలను (జిహాద్) చేయవలసినదేనన్న కఠోర సత్యాన్ని కుర్ఆన్ ద్వారా అల్లాహ్ తెలియజేయటం జరిగింది.

అహింసను రక్షించే నిమిత్తం కొద్దిపాటి హింసను తప్పని పరిస్థితులలో జరుపుటలో మానవుల పాత్ర ఏమీ ఉండదని అది ఖుర్ఆన్ ద్వారా దైవం ఇచ్చిన సందేశమేనని మనం అర్థం చేసుకుందాం.

అన్యాయాన్ని దూరం చేసి న్యాయాన్ని నిలబెట్టడంలో తప్పక ఖుర్ఆన్‌లోని అధ్యాయాల్ని సహేతుకంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మన మందరం తెలుసుకుందాం.

కొంతమంది స్వార్థపరులు తమ స్వప్రయోజనాల కోసం పవిత్ర కుర్ఆన్‌లోని విషయాలను మార్చి కొంతమందిని ఏమార్చి దుష్ప్రచారాలు చేస్తూ ఈ గ్రంథంలోని గొప్ప విషయాల ఔన్నత్యాన్ని మంటగలిపేలా ప్రవర్తిస్తున్నారు. ఇట్టి దుర్వర్తనులు ఏనాటికైనా ఖుర్ఆన్‌లో ప్రస్తావించబడిన పరలోక శిక్షలు పొంది తీరవలసిన అవసరం ఉంటుందని మర్చిపోవద్దు. కర్మఫలం లెక్క అల్లాహ్ తేల్చిన వేళ వాళ్ళ క్షమాపణను ఆయన స్వీకరించక శిక్షించే తీరుతాడు అని గుర్తెరిగి ప్రవర్తించమని మన పవిత్ర కుర్ఆన్ మనందరినీ మరీమరీ ముందే హెచ్చరిస్తూ ఉంది.

అల్లాహ్ ఖుర్ఆన్ ద్వారా ఇలా చెబుతున్నాడు :

**మా వాక్యాలకు పెడర్థాలు అంటగట్టేవారు మాకు కనిపించకుండా ఏమీలేరు. స్వయంగా మీరు ఆలోచించండి; ఏ వ్యక్తి మెరుగైనవాడు, అగ్నిలో పడవేయబడేవాడా లేక ప్రళయం నాడు భద్రమైన స్థితిలో హాజరయ్యేవాడా? మీరు కోరినదల్లా చేస్తూ ఉండండి. మీ చేష్టలు అన్నింటినీ అల్లాహ్ చూస్తూనే ఉన్నాడు.**

***(ఖుర్ఆన్ అధ్యాయం – 41: 40వ ఆయత్)***

పైన చెప్పబడిన ఆయత్ చదివిన ప్రతి ముస్లిం కూడా ఈ ధృగ్విషయం గుర్తు ఉంచుకునే తీరాలి. అదేమనగా అల్లాహ్ ప్రసాదించిన దివ్య ఖుర్ఆన్ మనందరినీ మానవతా విలువలు నింపుకుని జీవించమని మాత్రమే తెలియజేస్తూ మానవతా విలువల్ని ప్రపంచమంతా చాటి చెబుతూ జీవించమని తెలుపుతున్నది. ఇక్కడ గుర్తుంచుకోవలసిన మరో విషయం ఏమిటంటే ఖుర్ఆన్ కేవలం ముస్లింల కోసమే రాలేదు; అది ప్రపంచ మానవులందరి కోసం వచ్చింది. దీని ఆరంభం, **'బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్'**తో అవుతుంది. అంటే 'అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ నామంతో' అని దీని అర్థం. దీని ద్వారా స్పష్టమయ్యేదేమిటంటే కృపాకరుడు, దయాళువు అయిన అల్లాహ్ యొక్క గ్రంథం- ఖుర్ఆన్ కూడా లోకవాసులందరి పట్ల కారుణ్య ప్రదమే అయి ఉంటుంది. దీనికి ప్రమాణం ఖుర్ఆన్‌లోనే ఇలా ఉంది:

> **"ప్రపంచ ప్రజలకు అన్యాయం చేయాలనే ఉద్దేశ్యం అల్లాహ్‌కు ఏమాత్రం లేదు.** ***(ఖుర్ఆన్ అధ్యాయం-3, 108వ ఆయత్)***

ఈ విషయం ఒక్కటి మళ్ళీ మళ్ళీ మీ అందరికీ విన్నవించదలిచాను. అల్లాహ్ మనందరి కోసం ప్రసాదించిన దివ్య ఖుర్ఆన్ ప్రపంచమంతటా శాంతి, ప్రేమ, అహింస, సత్యం, మానవత అనే విలువైన వజ్రాలతో నింపి మనల్ని అందుకోమని, వాటి ద్వారా మన జీవన కళాత్మక విలువలను పెంచుకోమని మళ్ళీ మళ్ళీ శాసిస్తున్నాడు అని తెలుసుకుంటూ మనల్ని మనం సకారాత్మక దృక్పథం వైపు నడిపించుకుందాం. మనల్ని తప్పుదారి పట్టించే కొన్ని రకాల మీడియా వంటి వారికి దొరకకుండా ఉందాం.

**- స్వామి లక్ష్మీ శంకరాచార్య**

28 ఏప్రిల్ 2016

2, షాబాన్, హిజ్రీ 1438

**అధ్యాయం : 2**

# జీవన కళ- ఖుర్ఆన్

ముందుగా అసలు 'ధర్మం' అంటే ఏమిటో, ఆ పదం నిర్వచనం (Difination) ఏమిటో ఒకసారి తెలుసుకుందాం. ధర్మం యొక్క నిర్వచనం ఏమిటి అంటే- ఏదైతే తెలుసుకున్న తర్వాత దానిని మనం మన జీవితంలో సులువుగా, తప్పక అమలు పరచగలిగేలా యోగ్యత కలిగి ఉంటుందో అదే ధర్మం.

ఇంకా- ఏ ధర్మం అయితే మన జీవన గమనంలోని ప్రతి అడుగులోను అమలుచేస్తే సమర్ధవంతమైన ఫలితాలను అందిస్తూ మన జీవన ప్రయాణాన్ని సుగమం చేస్తుందో అదే ధర్మం. అది ఆధ్యాత్మిక ఫలితం కావచ్చు, ఆర్థిక ఫలితం కావచ్చు, సామాజిక లేక రాజనీతి పరమైన, వ్యక్తిగత ఫలితం కావచ్చు.

పవిత్ర గ్రంథం ఖుర్ఆన్ తెలియజేసిన ధర్మం పూర్తి ఫలితాలను పొందటం కోసం ఇదొక్కటే పరిపూర్ణమైన మార్గమని, సంపూర్ణ మార్గదర్శిని అని తెలియజేసింది.

జీవితంలో ప్రతి అడుగుని ఎంత జాగ్రత్తగా వేయాలి? జీవితాన్ని ఎంత అందంగా ఆనందంగా జీవించవచ్చు? తల్లిదండ్రులతో, ఆలుబిడ్డలతో, కుటుంబ సభ్యులతో, సామాజిక సంబంధాలతో ఎలా ప్రవర్తించాలి? ఎలా ప్రవర్తించరాదు... ఇత్యాది విషయ పరిజ్ఞానాన్ని మనకందించి మంచిచెడ్డల మధ్య తేడా ఎలా తెలుసు కోవాలి, వాటిని ఎలా మన జీవితంలో ఉపయోగించుకోవాలి, మనందరి జీవితాల్ని కళాత్మకంగా, ఒకరిని నొప్పింపక, తానొవ్వక ఎలా జీవించాలి వంటి చక్కటి కళాత్మక జీవన విలువలను మన అనంత కరుణామయుడు అల్లాహ్ అందించిన ఖుర్ఆన్ పవిత్ర గ్రంథం సాక్షిగా నేర్చుకోవాలి. నేర్చిన వాటిని అమలుపరచాలి. ఇతరులకు అందజేయాలి. ఇది ఒక సలహా లాంటిది కాదు. ఇది ఇష్టమైతే లేక అవసరమైతే తీసుకోవటం లేకపోతే వదిలివేయటం కాదు.

ఇది ముస్లిములు అందరికి అల్లాహ్ అందించిన జీవన విధానం. జీవన కళా నిర్మాణానికి సూత్రాలు. ప్రతి ఒక ముసల్మాను తప్పక ఆచరించి తీరాల్సిన ధర్మగ్రంథం ఖుర్ఆన్. దీనిలోని ప్రతి ధర్మసూత్రం ఆచరించిన వారి జీవితాలు ఎంతో ధన్యత చెందుతాయి. ఆఖరి న్యాయదినం సందర్భంలో అల్లాహ్ ముందు సగర్వంగా తల నిట్టనిలువుగా ఉంచి మనం అల్లాహ్‌ని చూడగలిగే శుభ సమయం పొందుట కొరకు మనమంతా తప్పక ఆచరించి తీరవలసిన ధర్మగ్రంథమే మనందరికి అల్లాహ్ ద్వారా ప్రసాదించబడింది అని తెలుసుకుని జీవిద్దాం.

ఈ పుస్తకంలోని ఖుర్ఆన్ వచనాల కొరకు నేను మౌలానా ఫారూఖ్ ఖాన్ గారి ఖుర్ఆన్ హిందీ అనువాదంపై, మౌలానా ఫతే ముహమ్మద్ జలంధరీ గారి హిందీ అనువాదంపై ఆధారపడ్డాను.

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్

## అధ్యాయం-3

# ఖుర్ఆన్‌లో అహింస

చాలామంది అనుకుంటారు- ఇస్లాంలో అసలు అహింసకు తావులేదు. ఇస్లామీయ పద్ధతుల్లో జిహాద్‌కి చాలా ప్రాముఖ్యత ఉంటుంది కదా అని తప్పుగా అర్థం చేసుకుంటూ ఉంటారు. కాని నిస్సంకోచంగా పవిత్ర ఖుర్ఆన్‌లో అహింస అనే సూత్రం అత్యంత ప్రాముఖ్యత కలిగిన సువర్ణ మంత్రం. ఏ ఒక్క ముస్లింను కదిలించినా ఇస్లాంలో మనసా వాచా కర్మణా అహింస అనే సూత్రాన్ని అమలు పరుస్తున్నాం అనే అంటారు.

అహింస మూడు రకాలుగా చెప్పబడింది. మన పవిత్ర ఖుర్ఆన్‌లో....

1) మానసిక అహింస 2) మాటతో అహింస 3) కర్మతో అహింస

1) **మానసిక అహింస:** ఎవరినీ ఏవిధంగా కూడా కష్టపెట్టే ఆలోచన చేయకూడదు.

2) **మాటతో అహింస:** ఎవరినీ ఏవిధంగా కూడా మనస్తాపం కలిగించే మాట అనరాదు.

3) **కర్మతో అహింస :** ఎవరినీ ఏవిధంగా కూడా కష్టపెట్టే పని చేయరాదు.

**ఇక, పరలోకంలోని గృహాన్ని మేము భూమిపై తమ పెద్దరికాన్ని కోరుకోని వారికీ, కల్లోలాన్ని సృష్టించగోరని వారికీ ప్రత్యేకించి ఉంచుతాము. మేలైన పరిణామం మాత్రం భయభక్తులు కలవారికే.**

***(ఖుర్ఆన్ అధ్యాయం 28 : 83వ ఆయత్)***

అల్లాహ్ ఈ ఆదేశాలలో ముఖ్యంగా భువిపై కల్లోలం రేకెత్తించకుండా జీవించ గలగటం జీవన కళారీతిగా భావించమని తెలిపాడు. అన్ని రకాల ఆటంకవాదాలు స్వర్గమార్గానికి అవరోధాలు అని ఖుర్ఆన్ స్పష్టం చేస్తుంది.

## 2) మాటతో అహింస

**ప్రవక్తా! మంచీ,చెడూ ఒకటి కావు. నీవు చెడును శ్రేష్ఠమైన మంచి ద్వారా తొలగించు. అప్పుడు నీ పట్ల శత్రుభావం కలవాడు నీకు ప్రాణ స్నేహితుడై పోవటాన్ని నీవు గమనిస్తావు.**

***(ఖుర్ఆన్ అధ్యాయం 41: 34వ ఆయత్)***

ఎవరైనా తమ కటువైన మాట తీరుతో బాధించినప్పటికీ అతనిని మంచి మాట తీరుతో చాలా మంచి స్నేహితులుగా మార్చుకోగలిగిన కళనే మాటతో అహింసగా భావించవచ్చు.

ఇస్లాం అనేది ప్రతి విషయంలోను వ్యతిరేకించమని గానీ, యుద్ధం చేయమని గానీ, జిహాద్ చేయమని గానీ తెలుపలేదు. మంచి మాటలతో, స్నేహంతో హృదయాలను జయించమని ఆదేశిస్తుంది. ఆనందంగా జీవించమని చెబుతుంది.

## కర్మతో అహింస

**ఈ కారణం వల్లనే మేము ఇస్రాయీలు సంతతికి ఈ ఫర్మానాను వ్రాసి ఇచ్చాము: "హత్యకు బదులుగా గాని లేదా కల్లోలాన్ని వ్యాపింప జేసినందుకుగాని కాక మరే కారణం వల్లనైనా ఒక మానవుణ్ణి చంపిన వాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే."**

***(ఖుర్ఆన్ అధ్యాయం 5: 32వ ఆయత్ )***

ఈ అధ్యాయంలో ప్రత్యక్ష రీతిలో తెలియజేయబడినది– ఎవరైతే ఒక నిర్దోషిని హత్యచేస్తారో వారికి అల్లాహ్ స్వర్గంలోకి ఎట్టి పరిస్థితులలోను ప్రవేశం ఉండదని, ఎవరైనా అట్టి నిర్దోషిని రక్షించిన వారికి తప్పక ముక్తి ప్రసాదించబడునని అల్లాహ్ ప్రసాదించిన ఈ పవిత్ర గ్రంథం తెలియజేసింది.

ఇదే అల్లాహ్ తెలిపిన మనసా వాచా కర్మణా అహింసకు అర్థం, పరమార్థం. ప్రతి ఒక్కరూ దీనిని చదివి, జీర్ణించుకుని అమలుచేసి అల్లాహ్ కృపకు పాత్రులయ్యేలా జీవించాలి.

## అధ్యాయం-4

# ఖుర్‌ఆన్‌లో మానవత

చదువరులారా! పవిత్ర ఖుర్‌ఆన్‌లో 'మానవత'కు అత్యున్నత స్థానం ప్రసాదించ బడింది. ప్రాపంచిక జీవితంలో మంచి పనులు చేయనంత వరకూ, మేలు చేయనంత వరకూ ఎవరికీ మోక్షం–అంటే స్వర్గం–లభించదని అనబడింది.

మానవ జీవనంలో మానవత్వపు చర్యలు లేని మానవ జన్మ పరమ నీచమైన దని, అది ఎట్టి పరిస్థితులలోనూ దేవుని చేరుకోవటానికి ఉపయోగం లేనిదని, ముక్తి పొందటం ఎట్టి పరిస్థితులలోను సంభవం కాదని, ఎవరైతే తమ జన్మను అల్లాహ్‌కు సమర్పించదలచారో వారు తమ మానవ జన్మను మానవత్వపు సకారాత్మక దారిలో నడిపించవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలుసుకోవాలి. అట్లు జీవించని మానవులు ఆఖరి న్యాయ నిర్ణయ దినాన కరుణామయుడైన అల్లాహ్ ముందు నిలబడి సమాధానం చెప్పగల అవకాశాన్ని పోగొట్టుకుంటారు.

> **వాస్తవమేమిటంటే, ఎవరు తమను తాము అల్లాహ్ పట్ల విధేయతకు అంకితం చేసుకుని, ఆచరణలో సన్మార్గం అవలంబిస్తారో, దానికి వారు తమ ప్రభువు వద్ద మంచి ప్రతిఫలం పొందుతారు. అటువంటి వారికి భయంకాని, దుఃఖం కాని కలిగే అవకాశం ఎంతమాత్రం లేదు.** ***(ఖుర్‌ఆన్ 2: 112)***

## ఖుర్‌ఆన్‌లో మానవత గురించి ఇవ్వబడిన ఆదేశం

ఒకప్పుడు ముస్లింలకు అత్యంత పవిత్ర స్థలంగా భావించబడే మక్కాలో అమానవీయ పరిస్థితులు ప్రబలంగా ప్రబలి ఉండేవి. అన్ని రకాల అసత్యాలు, అకృత్యాలు, సత్యం గొంతునొక్కే బాధాకరమైన పరిస్థితులు అక్కడి ప్రజలను బాధిస్తున్న రోదనాభరిత రోజులవి. ప్రజలు రంగులననుసరించి, నల్లవారిని తెల్లవారు, డబ్బున్న వారు డబ్బులేనివారిని చిన్నచూపు చూడటం, తమ మాటలతో, చేతలతో కూడా

ఎంతో వ్యధకు గురిచేయటం, బీదవారికి అప్పులిచ్చి ఇష్టమొచ్చినంత వడ్డీ వసూలు చేయటం, సారాయి, జూదం వంటి వ్యసనాల్లో మునిగి తేలుతున్న దుర్దినాలు అవి. ఒక వ్యక్తి మరో వ్యక్తిని బానిసగా కొనుట, బాధించుట సర్వసాధారణంగా భావించబడుతున్న ఆ రోజుల్లో 'మానవత' అనే మాటను కూడా అపహాస్యం చేసేవారు ఎక్కువగా ఉండేవారు. అటువంటి నికృష్ట ఘడియలలో ప్రవక్త ముహమ్మద్(స) మక్కాలోని అమానవీయ ప్రజలకు సత్యం, శాంతి, అహింస, మానవతా విలువల ఖుర్‌ఆన్ సందేశాన్ని అందజేయటం ప్రారంభించారు.

## ఖుర్‌ఆన్ ప్రకారం 'మానవత' పాలిట శత్రువులు ఎవరు?

**పరలోక శిక్షను, బహుమానాన్ని తిరస్కరించే వ్యక్తిని నీవు చూశావా? అతడే అనాథులను కసరికొట్టేవాడు, పేదవాళ్ళకు అన్నం పెట్టు అని ప్రోత్సహించనివాడు. పోతే, తమ నమాజుల పట్ల అశ్రద్ధ వహించేవారు, ప్రదర్శనాబుద్ధితో వ్యవహరించేవారు, వాడుకునే మామూలు వస్తువులను (ప్రజలకు) ఇవ్వటానికి వెనుకాడేవారు సర్వనాశనమవుతారు.** ***(ఖుర్‌ఆన్ 107: 1-7)***

## దానధర్మాలు మానవతను మేల్కొల్పుతాయి

**మీరు మీ దానధర్మాలను బహిరంగంగా చేసినా మంచిదే. కాని రహస్యంగా నిరుపేదలకు దానమివ్వటం మీకు ఎక్కువ మేలు చేకూరుస్తుంది. మీ దుష్కార్యాలు ఎన్నో దీనివల్ల సమసిపోతాయి. మీరు ఏమి చేసినా అది అల్లాహ్‌కు తెలుస్తుంది.** ***(ఖుర్‌ఆన్ 2: 271)***

**విశ్వసించిన ప్రజలారా! మీరు సంపాదించిన ధనంలోని, మేము మీ కొరకు నేల నుండి ఉత్పత్తి చేసిన దానిలోని మేలైన భాగాన్ని దైవ మార్గంలో ఖర్చుపెట్టండి. ఆయన మార్గంలో ఇవ్వటానికి పనికిరాని వస్తువులను ఏరితీసే ప్రయత్నం చెయ్యకండి. (ఖుర్‌ఆన్ 2 : 267)**

**తమ సంపదను రేయింబవళ్ళు బహిరంగంగానూ, రహస్యంగానూ ఖర్చు చేసేవారు తమ ప్రతిఫలాన్ని తమ ప్రభువు వద్ద పొందుతారు. వారికి ఏ విధమైన భయం గాని, దుఃఖం గాని కలిగే అవకాశం లేదు.** ***(ఖుర్‌ఆన్ 2 : 274)***

## వడ్డీ తీసుకునేవారు మానవతా విరోధులు

వడ్డీ తీసుకోవటమంటే ఒకరి గత్యంతరం లేని పరిస్థితి ద్వారా లబ్ధి పొందటమే. ఇదొక సామాజిక చెడుగు, మానవత్వం లేని పని. కేవలం ఖుర్‌ఆన్ మాత్రమే ఈ చెడుగును ఖండించింది.

**వడ్డీ తినేవారి స్థితి షైతాన్ పట్టటం వల్ల ఉన్మాది అయిన వ్యక్తి స్థితి లాంటిది. ఈ స్థితికి వారు గురికావటానికి కారణం వారు "వ్యాపారం కూడా వడ్డీలాంటిదేగా" అని అనటమే.** ***(ఖుర్‌ఆన్ 2: 275)***

**అల్లాహ్ వడ్డీని నశింపజేస్తాడు. దానధర్మాలను పెంచి అధికం చేస్తాడు. కృతఘ్నుడూ, దుష్టుడూ అయిన వ్యక్తిని అల్లాహ్ ప్రేమించడు.** ***(ఖుర్‌ఆన్ 2: 276)***

**మీ బాకీదారుడు ఆర్థిక ఇబ్బందులలో ఉంటే, అతని పరిస్థితి మెరుగు పడే వరకు గడువు ఇవ్వండి, లేక మీరు తెలిసినవారే అయితే, ఆ బాకీని అతనికి దానం చెయ్యండి. అది మీకు ఎక్కువ శ్రేయస్కరం.** ***(ఖుర్‌ఆన్ 2: 280)***

**విశ్వసించిన ప్రజలారా! మీరు నిజంగా విశ్వాసులే అయితే, అల్లాహ్‌కు భయపడండి, ఇంకా మీకు ప్రజల నుండి రావలసిన వడ్డీని విడిచి పెట్టండి. కాని ఒకవేళ మీరు అలా చెయ్యకపోతే, మీపై అల్లాహ్ తరఫు నుండి, ఆయన ప్రవక్త తరఫు నుండి యుద్ధ ప్రకటన ఉంది అనే విషయం తెలుసుకోండి. ఇప్పుడైనా మీరు పశ్చాత్తాపపడితే (వడ్డీని వదులుకుంటే) అసలు సొమ్ము తీసుకోవటానికి హక్కుదారులవుతారు. మీరూ అన్యాయం చెయ్యకూడదు, మీకూ అన్యాయం జరగకూడదు.** ***(ఖుర్‌ఆన్ 2 : 278, 279)***

## విధవలు, అత్యంత పేదరికంలో మగ్గుతున్న బాలికల వివాహం

**మీలో ఎవరు వివాహం లేకుండా ఒంటరిగా ఉంటున్నారో; మీ స్త్రీ పురుష బానిసలలో ఎవరు గుణవంతులో, వారి వివాహాలు చేసి వేయండి. వారు గనక పేదవారయితే, అల్లాహ్ తన అనుగ్రహంతో వారిని సంపన్నులుగా చేస్తాడు. అల్లాహ్ అంతులేని వనరులు కలవాడు. సర్వమూ తెలిసినవాడు. (ఖుర్‌ఆన్ 24: 32)**

ఈ విధంగా మానవతను నింపి ప్రపంచాన్ని సంతసపరచుదాం.

అధ్యాయం : 5

# ఖుర్ఆన్‌తో యుద్ధం గురించి కాదు, శాంతి గురించిన ఆదేశాలు

పవిత్ర ఖుర్ఆన్‌లోని అధ్యాయాలు మనందరికీ మార్గదర్శి అయిన హజ్రత్ ముహమ్మద్(స) వారి పరిస్థితులనుబట్టి అవతరించినవే. ఎందుచేతనంటే వారి పరిస్థితుల అవసరార్థం అల్లాహ్ పంపించినవే ఈ పవిత్ర ఆదేశాలు. అందుచేతనే ఖుర్ఆన్‌లోని అధ్యాయాలు చదివేముందు హజ్రత్ ముహమ్మద్ (స) గారి జీవిత చరిత్ర చదవవలసిన అవసరం ఎంతైనా ఉంది.

అప్పుడే మనకు ఖుర్ఆన్‌లో చర్చించబడిన సత్యం, శాంతి, అహింస, మానవత్వం మహత్తు అర్థం అవుతుంది. మరో ముఖ్య విషయం ఏమిటంటే ఇక్కడ ఆదేశించబడిన యుద్ధం, కఠోరత లేక కఠినత్వం ప్రయోజనం అప్పటి సామాజిక పరిస్థితుల అవసరార్థం మాత్రమేనని గ్రహించాలి.

ఉదాహరణకు ఒక సైనికుడు లేక సైన్యాధికారి అహింసో పరమోధర్మః అన్న నానుడిని గట్టిగా నమ్మి అమలుపరిచినట్లయితే ఎంతటి ప్రమాదకర పరిస్థితులు ఆ దేశం ఎదుర్కోవలసి వస్తుందో ఆలోచిస్తేనే గుండెలవిసిపోతాయి. ఆ సమయంలో ఆ సేనాని యొక్క ధర్మం పరిస్థితులపై ఆధారపడి మారాలి.

సరిగ్గా ఇదే పద్ధతిలో మానవులందరి మంచిని కోరి పరమ ప్రభువైన అల్లాహ్ హజ్రత్ ముహమ్మద్ (స)కు ఎంతో విలువైన సత్యం, శాంతి, అహింస, మానవత అనే ఆణిముత్యాల్లాంటి ఆజ్ఞలను దయతో ప్రసాదించటం జరిగింది. మక్కా అంతటా తిరిగి ఆయన వీటినే ముఖ్యంగా ప్రచారం చేశారు. వీటిని ప్రచారం చేయటం వల్లనే దుష్ప్రవర్తనులు ఆయనను వ్యతిరేకించేవారు. ఆయనపైన, ఆయన అనుచరుల పైన ఘోర అత్యాచారాలు జరిగేవి. ఎటువంటి అత్యాచారాలంటే, వారిని బట్టలు లేకుండా చేసి మక్కాలోని కాలుతున్న ఇసుకపై దొర్లించేవారు. హజ్రత్ ముహమ్మద్(స) గారిని హత్య చేయుటకు గట్టి ప్రయత్నాలు కూడా జరిగాయి. ఈ హింసాత్మక ప్రతి

చర్యలు రమారమీ 13 సంవత్సరాలు జరుగుతూనే ఉండేవి. వీటిని భరించటానికి అవసరమైన ధైర్యపూర్వక ఆదేశాలు అల్లాహ్ నుంచి హజ్రత్ ముహమ్మద్(స)కి అందుతూ ఉండేవి.

మానవ చరిత్రలోనే సుదీర్ఘ కాలం వరకు జరిగిన దౌర్జన్యాలను, అత్యాచారాలను ముహమ్మద్ ప్రవక్త(స) తన అనుయాయులతో సహా ఓపికతో భరించారు. ప్రతికూల వాతావరణంలో కూడా సత్యం, అహింస, శాంతి, మానవత్వం కొరకు తన కృషిని కొనసాగించారు.

కాని సహనానికీ ఒక హద్దు ఉంటుంది. అలాగే మన ప్రియప్రవక్త హజ్రత్ ముహమ్మద్, ఆయన అనుయాయులు, వారిపై జరుగుతున్న భీకర అత్యాచారాలను సహించలేక మక్కా వదిలి 454 కిలోమీటర్లు దాటి మదీనా చేరటం జరిగింది. కాని వారిని ఆ దుష్టులు అక్కడ కూడా వదలిపెట్టలేదు. కాని మన ప్రవక్త వారితో శాంతిపూర్వక సయోధ్య నెరపుటకు చాలా ప్రయత్నించినప్పటికీ అవన్నీ బూడిదలో పోసిన పన్నీరు వలె వృధా అయ్యాయి.

అప్పుడు పరమ దయామూర్తి అయిన అల్లాహ్ వారికి చూపిన మార్గమే యుద్ధం. వారిలోని అశాంతి, అధర్మం, అమానవీయత, అసత్యం వంటి దుష్ట గుణాలతో యుద్ధం చేయవలసిందే, వాటిని సమూలంగా నిర్మూలించవలసిందే వంటి ఆదేశాలు అల్లాహ్ నుంచి అందాయి. వారికి మిగిలిన ఆ ఒక్క దారి అల్లాహ్ చూపినదే కావటం వల్ల వారు ఆ దుష్ట దుర్మార్గులపై యుద్ధం చేసి మక్కాయందు మదీనా యందు శాంతి, అహింస, సత్యం, మానవతను నిలబెట్టారు.

ఖుర్ఆన్‌లోని కొన్ని ఉదాహరణలు ఇప్పుడు చూద్దాం.

**ఎవరికి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యబడుతూ ఉందో, వారికి (యుద్ధం చేయటానికి) అనుమతి ఇవ్వబడింది; ఎందుకంటే వారు అన్యాయానికి గురి అయిన వారు. నిశ్చయముగా అల్లాహ్ వారికి సహాయం చేయగల సమర్థుడు.** ***(ఖుర్ఆన్- 22: 39)***

ఇక్కడ హజ్రత్ ముహమ్మద్ చేసిన ఈ జిహాద్ ఎంత మర్యాదతో నిండినదో ఈ ఉదాహరణ ద్వారా స్పష్టమైపోతుంది. రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న రోజులలో 50–70 మిలియన్ల జనం చంపబడ్డారు. కాని 622 సంవత్సరం నుండి 632 సంవత్సరం మధ్య అనగా 10 సంవత్సరాల కాలంలో హజ్రత్ ముహమ్మద్(స)

జరిపిన ధర్మయుద్ధ కాలంలో కేవలం 259 మంది ముస్లింలు, 759 ముస్లిమేతరులు మరణించారు. దీనికి ముఖ్య కారణమేమనగా ఇది శాంతి స్థాపన కోసం తప్పనిసరి పరిస్థితులలో జరుపబడిన ధర్మయుద్ధం కాబట్టి. ఖుర్ఆన్ ప్రకారం పరమ దయా శీలుడైన అల్లాహ్‌కు కావలసినది రక్తపాతం లేక మరణాల సంఖ్య ఏమాత్రం కాదు. శాంతిస్థాపన మాత్రమేనని మనమందరం మరోసారి గుర్తెరిగి జీవించుదాం.

## శత్రుత్వం వద్దు- స్నేహమే ముద్దు

**మీరు ఈనాడు ఎవరితో విరోధం కొని తెచ్చుకున్నారో, వారికీ మీకూ మధ్య ఎప్పుడో ఒకప్పుడు అల్లాహ్, ప్రేమను కలిగించటం అసంభవమేమీ కాదు. అల్లాహ్ సర్వశక్తిమంతుడు; ఇంకా ఆయన క్షమించేవాడు, కరుణించేవాడూను.** ***(ఖుర్ఆన్ 60: 7)***

ముస్లిమేతరుల పట్ల న్యాయంగా వ్యవహరించాలి

**ఎవరైతే ధర్మం విషయంలో మీతో యుద్ధం చేయలేదో, మిమ్మల్ని మీ ఇళ్ళ నుండి వెళ్ళగొట్టలేదో, వారి పట్ల మీరు మంచితనంతో, న్యాయంతో వ్యవహరించటాన్ని అల్లాహ్ నిరోధించడు. అల్లాహ్ న్యాయం చేసేవారిని ప్రేమిస్తాడు.** ***(ఖుర్ఆన్ 60: 8)***

## దౌర్జన్యం చేసి బాధించువారిని ప్రక్కకు ఉంచుము

**ఎవరు మీతో ధర్మం విషయంలో యుద్ధం చేశారో, మిమ్మల్ని మీ ఇళ్ళ నుండి బహిష్కరించారో, మిమ్మల్ని బహిష్కరించటంలో పరస్పరం సహకరించుకున్నారో, వారితో మీరు స్నేహం చేయటాన్ని మాత్రం అల్లాహ్ వారిస్తున్నాడు. అటువంటి వారితో స్నేహం చేసేవారే దుర్మార్గులు** ***(ఖుర్ఆన్ 60: 9)***

ఈ అధ్యాయం ద్వారా మక్కా నివాసులైన హజ్రత్ ముహమ్మద్ అనుయాయులందరికీ ఆజ్ఞ అందజేయడం జరిగింది. – నిన్ను గాని నీకు తెలిసిన ఇతరులను గాని మక్కా నుంచి వెడలగొట్టు ప్రయత్నం చేయువారితో తెలిసి గాని తెలియకగాని స్నేహం చేసి మీరు దర్మార్గులుగా అల్లాహ్‌చే భావించబడవద్దు.

## కక్ష తీర్చుకొనుట కన్నా ఓరిమితో వ్యవహరించటం మిన్న

మనందరి కృపాశీలుడైన అల్లాహ్ చెప్పిన దాని ప్రకారం– ఖుర్ఆన్ ద్వారా

దొరికిన ఆజ్ఞ ఏమనగా కక్ష తీర్చుకునే భావన ఉన్నచోట దానిని తీసివేయుము. దాని స్థానంలో మరింత ఓరిమి చూపుట అల్లాహ్‌ను చాలా సంతోషపెట్టును.

> **ఒకవేళ మీరు ప్రతీకారం చేస్తే కేవలం మీపై దౌర్జన్యం జరిగిన మేరకే ప్రతీకారం చెయ్యండి. కాని మీరు సహనం చూపితే, అది నిశ్చయంగా సహనం చూపేవారికే మంచిది.** ***(ఖుర్ఆన్ 16: 126)***

## ఇస్లాం కత్తితో కాదు, తనలోని మంచితో వ్యాపించింది

ఇస్లాం కత్తి ద్వారా మాత్రమే వ్యాప్తి చెందిందని కొంతమంది తప్పుడు ప్రచారం జరుపుతున్నారు. అలానే ముస్లిమేతరులను బలవంతంగా ముస్లిములుగా మార్చుతున్నారనే దుష్ప్రచారం జరుపుతున్నారు. వారు తప్పక తెలుసుకొనవలసిందే మంటే– ధర్మం విషయంలో ఎట్టి బలవంతం లేదు. *(ఖుర్ఆన్ 2 : 256 ఆధారంగా)*

> **నీ ప్రభువు అభీష్టం గనక ఇదే అయితే (అంటే భూమిపై ఉండేవారంతా విశ్వాసులూ, విధేయులూ అవ్వాలి అనేది) సమస్త భూవాసులూ విశ్వ సించి ఉండేవారే. అలాంటప్పుడు నీవు ప్రజలను విశ్వాసులుగా మారండి అని బలవంతం చేస్తావా?** ***(ఖుర్ఆన్ 10: 99)***

ఈ ఆయత్‌ల ద్వారా అల్లాహ్ మనకు స్పష్టపరిచినది ఏమనగా– మన పవిత్ర కుర్ఆన్‌లో ఎక్కడ కూడా మీరందరూ ముస్లిములుగా అవండి అని అనబడ లేదు. ఇస్లాంను సరిగ్గా అర్థం చేసుకుని జీవన విధానంగా అలవర్చుకున్న వారే అసలైన ముస్లిములు అని తెలియజేయటం జరిగింది.

చివరిగా మరోసారి అల్లాహ్ ఆజ్ఞను గుర్తు చేసుకుందాం. స్పష్టతను పొందుదాం. ఇస్లాం ద్వారా, అల్లాహ్ ద్వారా, ఖుర్ఆన్ ద్వారా స్పష్టమైన ఆజ్ఞ ఇవ్వ బడినది. అది ఏమంటే కుర్ఆన్ శాంతిని పెంపొందించమని ఆజ్ఞాపించింది. ఈ శాంతి స్థాపనలో ఏదైనా అడ్డంకి వచ్చినప్పుడు మాత్రమే జిహాద్ లేదా యుద్ధం గురించి ఆలోచన చేయమని తెలుపుట జరిగింది.

అల్లాహ్ ఇంత స్పష్టంగా ఆదేశించినప్పటికి కొంతమంది తమ తమ స్వప్రయోజనాల కోసం కుర్ఆన్‌ను, ఇస్లాంను తప్పుగా ప్రచారం చేయుట ఇకనైనా మానుకోవాలి. అది ఇస్లాంకు జరుగుతున్న అన్యాయమే.

**అధ్యాయం : 6**

# ఖుర్ఆన్‌లో చెడుపై మంచి సాధించిన విజయం

అనంత కరుణామయుడు అల్లాహ్ ప్రసాదించిన ఖుర్ఆన్ ద్వారా మనకు అందిన ఆజ్ఞ ఏమనగా ఎక్కడ చెడు ఉన్నా అటువైపు నీవు పయనించవద్దు. మంచి ఉన్నచోట కష్టమైనను అటుగా వెళ్ళి ఆ మంచిని నేర్చుకుని నీ జీవితానికి అన్వయించుకో. అట్టి మంచిని నీకు కూడా తెలుపగల వ్యక్తిని నీ మొట్టమొదటి మంచి మిత్రునిగా భావించు.

**ప్రవక్తా! మంచీ, చెడూ ఒకటి కావు. నీవు చెడును శ్రేష్ఠమైన మంచి ద్వారా తొలగించు. అప్పుడు నీ పట్ల శత్రుభావం కలవాడు నీకు ప్రాణ స్నేహితుడై పోవటాన్ని నీవు గమనిస్తావు.** ***(ఖుర్ఆన్ 41: 34)***

**మనస్సును గాయపరచే దానం కంటే, మృదు భాషణం, క్షమాగుణం ఎంతో మేలైనవి.** ***(ఖుర్ఆన్ 2: 263)***

## మంచిని పెంపొందిస్తూ చెడును ఆపే సముదాయం

**మీలో మంచి వైపునకు పిలిచేవారూ, మేలు చెయ్యండి అని ఆజ్ఞాపించే వారూ, చెడు నుండి వారించేవారూ కొందరు తప్పకుండా ఉండాలి. ఈ పనిని చేసేవారే సాఫల్యం పొందుతారు.** ***(ఖుర్ఆన్ 3: 104)***

## చెడ్డ తనం యొక్క ఫలితం చెడుగాను, మంచితనం యొక్క ఫలితం మంచి గాను ఉంటాయి

**ప్రతి మనిషీ తాను చేసిన – మంచి చేసినా లేక చెడుచేసినా – దాని ఫలితాన్ని ప్రత్యక్షంగా చూసే రోజు రాబోతోంది. తనకు ఈ రోజు ఇంకా ఎంతో దూరంగా ఉంటే ఎంత బాగుండేది అని మనిషి ఆ**

రోజున కోరుకుంటాడు. అల్లాహ్ తనకు భయపడండి అని మిమ్మల్ని హెచ్చరిస్తున్నాడు. ఆయనకు తన దాసులంటే ఎంతో ప్రేమ"

***(ఖుర్ఆన్ 3: 30)***

**వారు అల్లాహ్‌నూ, అంతిమ దినాన్నీ విశ్వసిస్తారు. మంచిని చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. చెడుల నుండి ఆపుతారు. సత్కార్యాలలో సతతం చురుకుగా ఉంటారు. వారు సజ్జనులు. వారు చేసే ఏ మంచి పనికైనా విలువను ఇవ్వకపోవటం అనేది జరగదు.** ***(ఖుర్ఆన్ 3: 114)***

**చూడు! నమాజును స్థాపించు, పగటి యొక్క రెండు సరిహద్దు సమయాలలోనూ, కొంత రాత్రి గడిచిన తరువాతనూ. వాస్తవానికి సత్కార్యాలు దుష్కార్యాలను దూరం చేస్తాయి. అల్లాహ్‌ను జ్ఞాపకం ఉంచుకునే వారికి ఇది ఒక జ్ఞాపిక.** ***(ఖుర్ఆన్ - 11: 114)***

**భూమ్యాకాశాలలోని ప్రతి వస్తువుకూ యజమాని అల్లాహ్‌యే- చెడు చేసే వారికి అల్లాహ్ వారి కర్మలకు ప్రతిఫలం ఇచ్చేందుకు, సదాచరణ వైఖరి అవలంబించిన వారికి మంచి ప్రతిఫలం ప్రసాదించేందుకు. వారు పెద్ద పెద్ద పాపాలకు, స్పష్టమైన అసభ్య చేష్టలకు దూరంగా ఉంటారు, కొన్ని పొరపాట్లు తప్ప.** ***(ఖుర్ఆన్ 53: 31,32)***

**అల్లాహ్ నీకు ఇచ్చిన సంపదతో పరలోకంలో గృహాన్ని నిర్మించుకునే యోచన చేయి. ప్రపంచంలో కూడా నీ వాటాను విస్మరించకు, అల్లాహ్ నీకు ఉపకారం చేసిన విధంగానే నీవూ ఉపకారం చేయి. భూమిపై కల్లోలాన్ని సృష్టించే ప్రయత్నం చేయకు. అల్లాహ్ కల్లోలం సృష్టించే వారిని ప్రేమించడు."** ***(ఖుర్ఆన్ 28: 77)***

**మీరు బహిరంగంగానూ, చాటుగానూ మేలే చేస్తూ పోతే లేదా కనీసం చెడును క్షమతో ఉపేక్షిస్తే అల్లాహ్ (గుణం కూడా ఇదే, ఆయన) క్షమించేవాడూ. (వాస్తవానికి ఆయన శిక్షించే) శక్తి కలవాడు కూడా.**

***(ఖుర్ఆన్ 4: 149)***

## మంచి మనిషిగా మారమని ఆజ్ఞ

ఈ ప్రాపంచిక జీవనంలో ప్రతి మనిషి తనలోని కామ, క్రోధ, మద, లోభ,

మోహాలను విడనాడి వాటిని సుదూరంగా పారద్రోలటం ద్వారా మాత్రమే మంచి మనిషిగా మారటానికి అవకాశం తప్పకుండా కలుగుతుంది అని అల్లాహ్ మన పవిత్ర ఖుర్‌ఆన్ ద్వారా తెలియజేసి ఉన్నాడు.

పరాయి స్త్రీలను దుర్భావనలతో చెడ్డ కోరికలతో చూచుట కామం, ఇతరులను హింసించాలని ప్రేరేపించేది క్రోధము, మదం అనగా గర్వం, లోభం అనగా పిసినారి తనం, పరాయి వారి ధనం, వస్తువులపై మోహము వంటి దుర్గుణాలు మానవత అనే మంచి గుణానికి శత్రువులు. మన పరమ పావనుడైన అల్లాహ్ వరాలనిచ్చే ఖుర్‌ఆన్ గ్రంథం ద్వారా ఈ విషయాలు మనకు తెలియజేశాడు.

## వ్యభిచారం అనే చెడుకు అత్యంత దూరంగా ఉండమని ఆజ్ఞ

వ్యభిచారం అనేది నేటి కాలంలో చాలా ఎక్కువగా ప్రబలుతున్న చెడ్డ జాడ్యంగా ఖుర్‌ఆన్‌లో చెప్పబడింది. దీనికి ముఖ్య కారణం, చిన్న మధ్య, పెద్ద తరహా తెరల ద్వారా ఇంకా ఇంటర్నెట్ అనే వైజ్ఞానిక ఉపయోగం ద్వారా నేడు ప్రబలుతున్న ఎంతో పెద్ద జాడ్యం అని ఒప్పుకోక తప్పని నిజం. దీని నుంచి ప్రతి ఒక్కరు తమను తాము కాపాడుకోవాలి. సమాజాన్ని కాపాడే క్రమంలో అశ్లీలతను, పరాయి స్త్రీ పురుషులపై మక్కువ వంటి వాటికి, నీలిచిత్రాలు వంటి వాటికి సుదూరంగా ఉండ వలసిన అవసరం ఎంతైనా ఉంది. స్త్రీలు పురుషులు తమ మర్యాదతో తాము జీవిస్తూ ఇతరుల మర్యాదను భంగపరచరాదు.

**అశ్లీల విషయాల దరిదాపులకు కూడా పోకండి, బహిరంగమైనవైనా సరే లేక గోప్యమైనవైనా సరే.** ***(ఖుర్‌ఆన్ 6: 151)***

**ప్రజలారా! భూమిలోని ధర్మసమ్మతమైన, పరిశుభ్రమైన వాటినన్నింటినీ మీరు తినండి. షైతాను చూపే మార్గాలను తొక్కకండి. వాడు మీకు బహిరంగ శత్రువు. దుర్మార్గాన్నీ, అశ్లీలాన్నీ చెయ్యండి అని వాడు మిమ్మల్ని ఆజ్ఞాపిస్తాడు. ఏ విషయాలను గురించి అయితే (అల్లాహ్ చెప్పినట్లు) మీకు తెలియదో ఆ విషయాలను అల్లాహ్ పేరుతో చెప్పండి అని మిమ్మల్ని ప్రేరేపిస్తాడు.** ***(ఖుర్‌ఆన్ 2: 168, 169)***

**దారిద్ర్య ప్రమాదం చూపి షైతాను మిమ్మల్ని భయపెడతాడు. నీతి బాహ్యమైన, నీచమైన మార్గం అవలంబించండి అని ప్రేరేపిస్తాడు.**

కాని మిమ్మల్ని క్షమిస్తానని, అనుగ్రహిస్తానని అల్లాహ్ వాగ్దానం చేస్తున్నాడు. అల్లాహ్ అత్యంత ఉదార స్వభావుడు, అన్నీ తెలిసినవాడు.

***(ఖుర్ఆన్ 2: 268)***

ఏదైనా సిగ్గుమాలిన పని చేసినప్పుడు, ఈ ప్రజలు ఏమంటారంటే, "ఈ పద్ధతినే మా తాత ముత్తాతలు అవలంబిస్తూ ఉండగా మేము చూశాము. ఇలా చెయ్యండి అని అల్లాహ్‌యే మమ్మల్ని ఆదేశించాడు." వారితో ఇలా అను: "సిగ్గుమాలిన పనిని అల్లాహ్ ఎన్నటికీ ఆదేశించదు. అల్లాహ్ తరపు నుండి వచ్చాయని మీకు తెలియని ఆ విషయాలను మీరు అల్లాహ్ పేరుతో ప్రకటిస్తున్నారేమిటి?" ***(ఖుర్ఆన్ 7: 28)***

వ్యభిచారం దరిదాపులకు కూడా పోకండి. అది అతి దుష్ట కార్యం.

***(ఖుర్ఆన్ 17: 32)***

ప్రవక్తా! విశ్వసించిన పురుషులకు తమ చూపులను కాపాడుకోండి అనీ తమ మర్మాంగాలను రక్షించుకోండి అనీ చెప్పు. ఇది వారికి ఎంతో పరిశుద్ధమైన పద్ధతి. వారు చేసే దానిని గురించి అల్లాహ్‌కు బాగా తెలుసు.

... ప్రవక్తా! విశ్వసించిన మహిళలకు ఇలా చెప్పు, తమ చూపులను కాపాడుకోండి అని, తమ మర్మాంగాలను రక్షించుకోండి అని, తమ అలంకరణను ప్రదర్శించవలదని– దానంతటదే కనిపించేది తప్ప– తమ వక్షస్థలాలను ఓణీ అంచులతో కప్పుకోవాలని, వారు తమ అలంకరణను వీరి ముందు తప్ప మరెవరి ముందూ ప్రదర్శించ కూడదని; భర్త, తండ్రి, భర్తల తండ్రులు, తమ కుమారులు, భర్తల కుమారులు, అన్నదమ్ములు, అన్నదమ్ముల కుమారులు, అక్కాచెల్లెళ్ళ కుమారులు తమతో కలిసీ మెలసీ ఉండే స్త్రీలు, తమ స్త్రీ పురుష బానిసలు, వేరే ఏ ఉద్దేశ్యమూ లేని వారి కింద పనిచేసే పురుష సేవకులు. స్త్రీల గుప్త విషయాలను గురించి ఇంకా తెలియని బాలురు, తాము గుప్తంగా ఉంచిన తమ అలంకరణ ప్రజలకు తెలిసేలా వారు తమ కాళ్ళను నేలపై కొడుతూ నడవరాదని కూడా వారికి చెప్పు.

***(ఖుర్ఆన్ – 24 : 30)***

**... విశ్వసించిన ప్రజలారా! మీరంతా కలసి అల్లాహ్ వైపునకు మరలి క్షమాభిక్షను వేడుకోండి. మీకు సాఫల్యం కలగవచ్చు.**

***(ఖుర్ఆన్ – 24 : 31)***

ఇంకా చెప్పాలంటే ఖుర్ఆన్ మాత్రమే మానవులను మంచి చరిత్ర గలవారిగా తమని తాము సమాజానికి చూపించుకునే అవకాశాన్ని ఇవ్వగలదు. కేవలం ఖుర్ఆన్ మాత్రమే తన చూపులను పరస్త్రీపై పడకుండా కాపాడుకోండి అని ఆదేశించి, అత్యున్నత పవిత్రతకు పునాదులు వేసింది.

ఎవరైతే అల్లాహ్ ఆజ్ఞలను ఖాతరు చేయరో లేక విశృంఖల జీవన విధానాలకు అలవాటు పడతారో అట్టివారికి సభ్యసమాజంలో మనగలిగే హక్కు లేదు. అలాంటి వారిని షైతాన్ ఆవహించాడని అనాలి.

ఇట్టి వారు అల్లాహ్ వేసే శిక్షలకు సిద్ధంగా ఉండాలి. తమ కర్మల ఫలాన్ని రుచి చూడటానికి వారు రెడీగా ఉండాలి.

## 'క్రోధానికి' దూరంగా ఉండాలన్న ఆదేశం

మానవులందరి యందు ఎంతో కొంత 'క్రోధం' ఉంటుంది. క్రోధమును ఆపుకొనుట అడ్డుకట్ట వేయుట అంత తేలికైన పని కానేకాదు. కాని ఈ క్రోధము అనే దుర్గుణం అతి కొద్ది సమయంలో జీవితాలను తారుమారు చేయగలదు. ఇంకా సంబంద బాంధవ్యాలను దారుణంగా చెడగొట్టగలదు.

ఇతరులలోని కోపాన్ని, దానికి గల ముఖ్య కారణాలను అర్థం చేసుకుని తప్పులను తమ క్షమ ద్వారా క్షమించి సంబంధాలను నిలకడగా నిలబెటుకునే కళను అల్లాహ్ మనకు ప్రసాదించిన దివ్యఖుర్ఆన్ ద్వారా తెలియపరిచాడు.

**వారు కలిమిలో, లేమిలో, ఏ స్థితిలో ఉన్నా తమ సంపదను ఖర్చు చేసేవారు, కోపాన్ని దిగమ్రింగేవారు, ఇతరుల తప్పులను క్షమించేవారు– ఇలాంటి సజ్జనులంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం.**

***(ఖుర్ఆన్ 3: 134)***

క్షమించేవారు, క్షమను కోరేవారు కూడా అల్లాహ్‌కు అత్యంత ప్రియమైన వారు. తమ తప్పులను తాము తెలుసుకుని క్షమాపణ కోరి అల్లాహ్ ప్రేమకు

పాత్రులైనవారు ఎంతటి ధన్యులో కదా! అలాగే ఇతరుల తప్పులను క్షమించి, వారిని తమ క్షమాగుణంతో స్నేహితులుగా మార్చుకొనువారు మరింత ధన్యత నొంది అల్లాహ్‌కు ప్రియమైన వారిలో ముందు వరుసలో నుందురనేది మనకు చరిత్ర ఆధారిత సత్యం.

**"పెద్ద పెద్ద పాపాలకూ, సిగ్గుమాలిన పనులకూ దూరంగా ఉండే వారి కోసం, కోపం వచ్చినప్పుడు కూడా క్షమించే వారి కోసం ..."**

***(ఖుర్ఆన్ 42 : 37)***

**ప్రవక్తా! మృదుత్వం, మన్నింపుల వైఖరిని అవలంబించు. మంచిని ప్రబోధించు. మూర్ఖులతో వాదానికి దిగకు. ఒకవేళ ఎప్పుడైనా షైతాను నిన్ను ఉసిగొలిపితే అల్లాహ్ శరణు వేడు. ఆయన అన్నీ వినేవాడు. అన్నీ తెలిసినవాడు.** ***(ఖుర్ఆన్ 7 : 199-200)***

## మదం అనగా గర్వం లేక అహంకారానికి దూరంగా ఉండుట

మదంతోను, గర్వంతోను మనుషులు ఇతరులను బాధపెట్టే మాటలు, కార్యాలు చేస్తారనేది జగమెరిగిన సత్యం. ఇట్టి గర్వంతో ఇతరులపై అధికారం చూపడం, పోట్లాటలు, జగడాలు చేయడం వంటివే జరుగుతాయి. మదం లేక అహంకారం వలన మనిషిలోని వివేకానికి తూట్లు పడిపోతాయి. ఈ వివేకం ఎప్పుడైతే నశిస్తుందో అప్పుడు మంచికి చెడుకు తేడా తెలియకుండా పోతుంది. సత్యానికి అసత్యానికి మధ్య ఉన్న అంతరం తెలియదు. అలాంటి వారు ఏది దుష్కారము ఏది మంచి కార్యం అనే తేడా తెలుసుకోలేని దుర్భర పరిస్థితులలోకి తమను తామే నెట్టివేసుకుని అల్లాహ్‌కు చాలా దూరంగా, శత్రువులుగా మిగిలిపోతారు.

ఇక్కడ మక్కాలో ఇట్టి మదమెక్కిన మానవుల వలన బాధలు అనుభవిస్తున్న హజ్రత్ ముహమ్మద్(స)ను గుర్తు చేసుకుందాం. ఈ సందర్భంగా మదంతో కళ్ళు మూసుకుపోయిన ఖురైషులకు అల్లాహ్ ద్వారా ఈ విధమైన ఆజ్ఞ పంపించబడినది-

**భూమిపై విర్రవీగుతూ నడవకండి. మీరు భూమిని చీల్చనూ లేరు, పర్వతాల ఎత్తుకు చేరనూ లేరు.** ***(ఖుర్ఆన్ 17: 37)***

ఆఖరుగా 'మదం' అనేది మనిషిని అధఃపాతాళానికి తొక్కివేయబడే శిక్షకు

గురిచేస్తుందని, అట్టి భయానక శిక్షకు గురికాకుండా మానవులలోని మదాన్ని ఎవరికి వారే గుర్తెరిగి దాన్ని సమూలంగా నాశనం చేసుకొనుటకు ఖుర్‌ఆన్‌ను సహాయకారిగా తీసుకుని మనల్ని మనం సంస్కరించుకోమని అల్లాహ్ మనందర్ని మేల్కొలుపు తున్నాడు.

**"అల్లాహ్‌కు భయపడు" అని అతడితో అన్నప్పుడు, అహంభావం అతడిని పాపానికే అంటుకుపోయేలా చేస్తుంది. అలాంటి వాడికి తగిన స్థలం నరకమే. అది అతి చెడ్డ నివాసం.** ***(ఖుర్‌ఆన్ 2: 206)***

## పిసినారితనానికి దూరంగా ఉండమని ఆజ్ఞ

లోభము లేక పిసినారితనం అనేది మానవుడిని అధమత్వం వైపు తీసుకుని పోవు దుర్గుణం. ఇది మనందరికి తెలిసినదే. కాని ఎంత తెలిసినప్పటికీ దీనినుండి తప్పించుకుని దూరంగా అల్లాహ్‌కు ప్రియమైన వ్యక్తులుగా ఎంతటి గట్టి ప్రయత్నం చేసినప్పటికీ విఫలురుగా నిలబెట్టగల బలమైన దుర్గుణం ఇదే అని చెప్పక తప్పదు.

**స్త్రీలూ, సంతానమూ, వెండి బంగారు రాసులూ, మేలుజాతి గుర్రాలూ, పశువులూ, సేద్యపు భూములూ వంటి వ్యామోహాలపై ప్రేమ ఆకర్ష కంగా చెయ్యబడింది. కాని ఇవన్నీ అనిత్యమైన ఐహిక జీవన సంపదలు మాత్రమే. అసలైన ఉత్తమ నివాసం అల్లాహ్ వద్ద ఉన్నదే. ఇలా చెప్పు; వాటి కంటే ప్రశస్తమైనదేదో నేను మీకు తెలిపేదా? భయభక్తులు కలవారి కొరకు వారి ప్రభువు వద్ద ఉద్యానవనాలు ఉన్నాయి. వాటి క్రిందుగా కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడ వారికి శాశ్వతమైన జీవితం లభిస్తుంది. పరిశుద్ధ చరితలైన భార్యల సాంగత్యం లభిస్తుంది. అల్లాహ్ సమ్మతి లభిస్తుంది. అల్లాహ్ తన దాసుల నడవడికను శ్రద్ధతో గమనిస్తాడు.** ***(ఖుర్‌ఆన్ 3: 14,15)***

## మోహానికి దూరంగా ఉండమని ఆజ్ఞ

ఏదైనా వస్తువుని గాని, ఎవరైనా వ్యక్తిని గాని మనమే దక్కించుకోవాలి అనే చెడుభావనని మోహం అంటారు. ఎక్కడ ఈ మోహం అనే భావన పుడుతుందో ఆ వ్యక్తిగాని ఆ వస్తువు గాని దక్కదు అనిపించినప్పుడు, దానిని నష్టపరచుటకు

లేదా నాశనం చేయుటకు పూనుకుంటారు మానవులు. ఇది మన దైవం ప్రసాదించిన దివ్య ఖుర్ఆన్ ప్రకారం పెద్ద పాపంగా అల్లాహ్‌చే పరిగణించబడుతుంది.

**విశ్వసించిన ప్రజలారా! న్యాయధ్వజవాహకులుగా నిలబడండి. అల్లాహ్ కొరకు సాక్షులుగా ఉండండి. మీ న్యాయం, మీ సాక్ష్యం మీకూ, మీ తల్లిదండ్రులకూ, మీ బంధువులకూ ఎంత హాని కలిగించినా సరే. కక్షిదారులు భాగ్యవంతులయినా, నిరుపేదలయినా అల్లాహ్ వారి శ్రేయస్సును మీకంటే ఎక్కువగా కాంక్షిస్తాడు. కనుక మీ మనోవాంఛలను అనుసరిస్తూ న్యాయం నుండి వైదొలగకండి. మీరు గనక సాక్ష్యాన్ని వక్రీకరిస్తే, న్యాయాన్ని దాటవేస్తే, బాగా తెలుసుకోండి, మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు అని.** ***(ఖుర్ఆన్ 4: 135)***

## దయార్ద్రతను పెంచుకోమని ఆజ్ఞ

దివ్య ఖుర్ఆన్ ఆజ్ఞానుసారం మనిషి మంచి పేరు పొందుటకు, అల్లాహ్‌కు ఇష్టులుగా, అత్యంత ఇష్టులుగా మారుటకు ఆయన చూపించిన అత్యున్నత మార్గమే ఈ దయాలుత.

**ఓ ప్రవక్తా! మేము నిన్ను ప్రపంచ మానవులకు కారుణ్యంగా పంపాము.**
***(ఖుర్ఆన్ 21: 107)***

## వినమ్రత (వినయం) అను సుగుణముకు మరింత దగ్గర కమ్మని ఆజ్ఞ

ఎంత వినమ్రత, ఎంత వినయం, ఎంత మెత్తటి మనః భావనలు కలిగి ఉంటే మనం అల్లాహ్‌కు అంతే ప్రియమైన వారము, దగ్గరి వారము కాగలం.

**కరుణామయుని(సిసలైన) దాసులు ఎవరంటే, వారు నేలపై అణకువతో నడుస్తారు. మూర్ఖులు వారిని పలుకరించినప్పుడు, మీకో సలామ్ అని అంటారు. (ఖుర్ఆన్– 25: 63)**

## విజ్ఞత

**ప్రవక్తా! నీ ప్రభువు మార్గం వైపునకు ఆహ్వానించు, వివేకంతో చక్కని హితబోధతో. ప్రజలతో ఉత్తమోత్తమమైన రీతిలో వాదించు. నీ ప్రభువుకే బాగా తెలుసు, ఆయన మార్గం నుండి తప్పిపోయిన వాడు ఎవడో, రుజుమార్గంలో ఉన్నవాడు ఎవడో.** ***(ఖుర్ఆన్ 16: 125)***

## ధైర్యం అనగా కష్టమును తట్టుకునే ఓర్పు

దివ్య ఖుర్ఆన్‌ని అనుసరించి మంచిగా మారటానికి సహాయపడే మరో ఆజ్ఞ సహనం, ఓర్పు. ఎవరైతే ఓర్పుతోను ధైర్యంతోను అల్లాహ్ చూపిన దారిలో నడిచి వస్తారో వారే అనంత కరుణామయుడైన అల్లాహ్‌కి నిస్సందేహంగా ప్రియమైన వ్యక్తులు అనియు, మరి ఇట్టివారే అల్లాహ్ చూపిన ముక్తిమార్గంలో నడుస్తున్నారని అల్లాహ్‌ని చేరుటలో వారే ప్రథములని ఖుర్ఆన్ గ్రంథం మనకు తెలియజేయుచున్నది. ఇదియే అల్లాహ్ అనంత కృపను మనం అందుకునే వరం అందిస్తుందని తెలుపుతున్నది.

**విశ్వాసులారా! సహనం ద్వారా, నమాజు ద్వారా సహాయం అర్థించండి. సహనం కలవారికి అల్లాహ్ తోడుగా ఉంటాడు.**

***(ఖుర్ఆన్ 2: 153)***

**భయ ప్రమాదాలకు, ఆకలి బాధకు, ధన, ప్రాణ, ఆదాయాల నష్టానికి గురి చేసి మేము మిమ్మల్ని తప్పకుండా పరీక్షిస్తాము. ఈ పరిస్థితులలో మనఃస్థయిర్యంతో ఉండేవారు కష్టకాలం దాపురించినప్పుడు, "మేమంతా అల్లాహ్‌కే చెందినవారము. అల్లాహ్ వైపునకే మరలిపోవలసిన వారము" అని అనేవారికి శుభవార్తలు తెలుపు. వారిపై వారి ప్రభువు తన అపూర్వ అనుగ్రహాలను కురిపిస్తాడు. ఆయన కారుణ్య ఛ్ఛాయలు వారికి ఆశ్రయమిస్తాయి. వారే సన్మార్గగాములు.**

***(ఖుర్ఆన్ 2: 155- 157)***

**ఓర్మి కలిగి ఉండు. అల్లాహ్ మంచి చేసేవారి ప్రతిఫలాన్ని ఎన్నటికీ వృథా చెయ్యడు.** ***(ఖుర్ఆన్ 11:115)***

**ఒకవేళ మీరు ప్రతీకారం చేస్తే కేవలం మీపై దౌర్జన్యం జరిగిన మేరకే ప్రతీకారం చెయ్యండి. కాని మీరు సహనం చూపితే, అది నిశ్చయంగా సహనం చూపేవారికే మంచిది.** ***(ఖుర్ఆన్ 16: 127)***

**అయితే ఎవరైనా సహనంతో వ్యవహరిస్తే, క్షమించివేస్తే, అది పెద్ద సాహసంతో, దృఢ సంకల్పంతో కూడుకున్న పని.** ***(ఖుర్ఆన్ 42:43)***

## అల్లాహ్ మనందరి కర్మలకు సాక్షి

నమాజును స్థాపించండి. జకాత్ ఇవ్వండి. మీ భవిష్యత్తు కోసం మీరు చేసి ముందుగా పంపించే సత్కార్యాలను మీరు అల్లాహ్ వద్ద చూస్తారు. మీరు చేసేదంతా అల్లాహ్ దృష్టిలో ఉంది. *(ఖుర్ఆన్ 2: 110)*

## అల్లాహ్ మంచికి ఎన్నో రెట్ల ఫలితం ఇస్తాడు

అల్లాహ్ ఎవరికీ రవ్వంత అన్యాయం కూడా చెయ్యడు. ఎవరైనా ఒక మంచి పని చేస్తే, దాన్ని అల్లాహ్ రెండింతలు చేస్తాడు. ఇంకా తన తరఫు నుండి పెద్ద ప్రతిఫలం కూడా ప్రసాదిస్తాడు.

*(ఖుర్ఆన్ 4: 40)*

## మరణ సమయంలో చెందిన పశ్చాత్తాపం దైవ సన్నిధిలో స్వీకారయోగ్యం అవదు

చావు గడియ సమీపించే వరకు ఎడతెగకుండా అకృత్యాలు చేస్తూ వుండి, "ఇప్పుడు నేను పశ్చాత్తాపపడుతున్నాను" అని అనేవారి పశ్చాత్తాపం ఎంత మాత్రం స్వీకరించబడదు. ఇదే విధంగా, మరణించే వరకు అవిశ్వాసులుగానే ఉండేవారి పశ్చాత్తాపం కూడా స్వీకరించబడదు. అటువంటి వారి కొరకు మేము అత్యంత బాధాకరమైన శిక్షను సిద్ధం చేసి ఉంచాము. *(ఖుర్ఆన్ 4: 18)*

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్

అధ్యాయం : 7

# ఆదర్శ న్యాయ వ్యవస్థ

దివ్య ఖుర్ఆన్‌లో తెలిపిన ఆదర్శ న్యాయవ్యవస్థ అనునది అత్యున్నతమైనది. అందరూ ఆచరించదగినది అని అల్లాహ్ తన ఆజ్ఞ ద్వారా తెలియజేయుచున్నాడు.

మనం న్యాయమును చేయునప్పుడు శత్రువుకి కూడా నిజమైన న్యాయాన్ని అందజేయాలి.

**శత్రువుకి కూడా నిజమైన న్యాయం అందించమని ఆజ్ఞ**

విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కొరకు సత్యంపై స్థిరంగా ఉండండి. న్యాయానికి సాక్షులుగా ఉండండి. (ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనయి న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి సరిసమానమైనది. అల్లాహ్‌కు భయపడుతూ వ్యవహరించండి. మీరు చేసేదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు. *(ఖుర్ఆన్ 5:8)*

**పక్షపాతం చూపకుండా సమన్యాయం అందించు అని ఆజ్ఞ**

విశ్వసించిన ప్రజలారా! న్యాయధ్వజవాహకులుగా నిలబడండి. అల్లాహ్ కొరకు సాక్షులుగా ఉండండి. మీ న్యాయం, మీ సాక్ష్యం మీకూ, మీ తల్లిదండ్రులకూ, మీ బంధువులకూ ఎంత హాని కలిగించినా సరే. కక్షిదారులు భాగ్యవంతులయినా, నిరుపేదలయినా అల్లాహ్ వారి శ్రేయస్సును మీకంటే ఎక్కువ కాంక్షిస్తాడు. కనుక మీ మనోవాంఛలను అనుసరిస్తూ న్యాయం నుండి వైదొలగకండి. మీరు గనక సాక్ష్యాన్ని వక్రీకరిస్తే, న్యాయాన్ని దాటవేస్తే, బాగా తెలుసుకోండి, మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు అని. *(ఖుర్ఆన్ 4: 135)*

## ప్రతీకార న్యాయం

**విశ్వసించిన ప్రజలారా! హత్యా వ్యవహారాలలో మీ కొరకు ప్రతీకార న్యాయం నిర్ణయించబడింది.** ***(ఖుర్ఆన్ 2: 178)***

## దొంగ చేతులు నరుకుము అని ఆజ్ఞ

ఇంకా ఖుర్ఆన్ ద్వారా అల్లాహ్ మనకు తెలియజేస్తున్న న్యాయరీతి ఆజ్ఞ ఏమనగా దొంగతనానికి అలవాటు పడిన స్త్రీ గాని పురుషుడు గాని మరోసారి అట్టి దుష్కార్యం జరపకుండా అత్యంత కఠినశిక్షగా వారి చేతులను నరికివేయాలి.

**దొంగ– స్త్రీ అయినా పురుషుడైనా, ఉభయుల చేతులూ నరకండి. ఇది వారి సంపాదనకు ప్రతిఫలం. అల్లాహ్ తరఫు నుండి గుణపాఠం నేర్పే శిక్ష. అల్లాహ్ సర్వశక్తిమంతుడు, అత్యంత వివేక సంపన్నుడు.**

***(ఖుర్ఆన్ 5: 38)***

## వ్యభిచారం చేయువారికి 100 కొరడా దెబ్బలు కొట్టమని ఆజ్ఞ

వ్యభిచారం కాని మానభంగం కాని చేసే స్త్రీ అయినా పురుషులైనా వారికి ఒక్కొక్కరికి వంద కొరడా దెబ్బలు కొట్టే కఠిన శిక్ష విధించమని, ఈ భయంతో మరో స్త్రీ గాని పురుషుడు గాని ఈ నేరాలు చేయుటకు సాహసించరని చెప్పబడింది.

**వ్యభిచారిణి, వ్యభిచారి– ఈ ఇద్దరిలో ప్రతి ఒక్కరికీ నూరేసి కొరడా దెబ్బలు కొట్టండి. మీరు అల్లాహ్‌పై, అంతిమ దినంపై విశ్వాసం ఉన్న వారే అయితే, వారి మీద కనికరం చూపే తలంపు అల్లాహ్ ప్రసాదించిన ధర్మ (నిర్వహణ) విషయంలో మిమ్మల్ని అడ్డుకోరాదు. వారిని శిక్షించేటప్పుడు విశ్వాసుల వర్గం ఒకటి అక్కడ ఉండాలి.**

***(ఖుర్ఆన్ 24: 2)***

ఇంకనూ న్యాయ వ్యవస్థలో ఆచరించవలసిన విషయాలను అల్లాహ్ ఇలా తెలిపాడు: ఎటువంటి నేరాన్ని విచారించినప్పటికీ అది బహిరంగంగా సామాజిక స్థానంలో చాలా మంది ముందు జరుపమని అల్లాహ్ ఖుర్ఆన్ ద్వారా ఆజ్ఞాపించుట జరిగింది.

సమాజంలో దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కొరకు శాసనాలు కఠినంగా ఉండటం అవసరం. చట్టాల ఉద్దేశం కేవలం దండించటం కాదు, శిక్షల భయం వల్ల సమాజంలో అపరాధాలు జరక్కుండా ఉండాలి.

**బుద్ధిజ్ఞానం కల ఓ మానవులారా! ఈ ప్రతీకార న్యాయం మీ సమాజానికి ఊపిరి. ఈ శాసనోల్లంఘనానికి మీరు దూరంగా ఉంటారని ఆశించబడుతోంది.** ***(ఖుర్ఆన్ 2: 179)***

ఇస్లామ్‌లోని ఇట్టి సర్వోత్తమ న్యాయవ్యవస్థ సౌదీ అరేబియా వంటి దేశాలలో నేటికీ కూడా కఠినంగా అమలు జరుగుతోంది. అందుకే అక్కడ కల్తీ, వ్యభిచారం, దొంగతనం, దోపిడీ, హత్యలు, బలాత్కారం వంటి నేరాలు చాలా తక్కువగా జరుగుతున్నాయి. ఉదాహరణకు, అక్కడి బజార్లలోని ముస్లిమ్ దుకాణదారులు శుక్రవారం వారి ప్రార్థన సమయం కాగానే దుకాణం మూయకుండానే వాటిలోని విలువైన వస్తువులు జాగ్రత్తగా సర్దిపెట్టకుండానే మస్జిద్‌కు వెళ్ళి ప్రార్థనలు జరిపి వస్తారు అని తెలిసి మిగిలినవారు ఆశ్చర్యపోతారు. కాని ఇది నేటికీ జరుగుతున్న పచ్చి నిజం. ఎందుచేతనంటే అక్కడి కఠినాతికఠినమైన శిక్షలపైనున్న భయం కంటే అల్లాహ్ దివ్యఖుర్ఆన్ ద్వారా అందించిన సమ న్యాయం, సమశిక్ష వంటి విషయాలపై ఎక్కువ అవగాహన కలిగినవారై అల్లాహ్‌కు ప్రియ వ్యక్తులుగా మారుతున్నారు.

## ఖుర్ఆన్ ప్రకారం ఆస్తి పంపకాలపై ఆజ్ఞ

సంపద లేక ఆస్తి పంపకాల ద్వారా ఎన్నో గొడవలు, ఎన్నో మారణ కాండలు జరుగుతాయి అనేది మనందరికీ తెలిసిన కటువైన సత్యం. వీటి వలన కుటుంబంలోని శాంతి, సంతోషం, సౌభ్రాతృత్వం పోయి కలతలు, కన్నీళ్ళు, కక్షలు కార్పణ్యాలు పెరిగి కొన్ని కుటుంబాలలో శత్రుత్వ భావనలు తరాల తరబడి కొనసాగుతూ ఉంటాయి. కాని మన మరణానంతరం గడ్డిపోచ కూడా అల్లాహ్ వరకు జరిగే ప్రయాణంలో మనతో రావు అని తెలిసి కూడా ఈ మాయకు, ఈ భ్రాంతులకు గురి అవ్వడం విడ్డూరం!

అందువలనే అల్లాహ్ మనందరి సృష్టికర్త మన కుటుంబ వ్యవస్థలోని లోపాలను సరిదిద్దుటకు పటిష్టమైన ఆస్తి పంపక వ్యవస్థని ఖుర్ఆన్ ద్వారా అందించటం జరిగినది.

మీ సంతానం విషయంలో అల్లాహ్ మీకు ఇలా ఆదేశిస్తున్నాడు : ఒక పురుషుని భాగం ఇద్దరు స్త్రీల భాగాలకు సమానం. ఒకవేళ (మృతునికి వారసులుగా) ఇద్దరికంటే ఎక్కువ మంది ఆడపిల్లలు ఉంటే, వారికి మొత్తం ఆస్తిలో మూడింట రెండు భాగాలు ఇవ్వాలి. ఒకే ఆడపిల్ల వారసురాలైతే, ఆస్తిలో అర్థభాగం ఆమెకు చెందుతుంది. మృతుడు సంతానం కలవాడైతే, అతని తల్లిదండ్రులలో ఒక్కొక్కరికి మొత్తం ఆస్తిలో ఆరోభాగం లభించాలి. ఒకవేళ అతడు సంతానం లేనివాడై అతని తల్లిదండ్రులు మాత్రమే అతనికి వారసులైతే, అప్పుడు తల్లికి మూడో భాగం ఇవ్వాలి. మృతుడికి సోదరీ సోదరులు కూడా ఉంటే, అప్పుడు తల్లికి ఆరోభాగం లభిస్తుంది. మృతుడు రాసిన వీలునామా అమలు జరిపి అతనిపై ఉన్న అప్పులు తీర్చిన తరువాతనే (ఈ భాగాల పంపకం జరగాలి). మీ తల్లిదండ్రులలో, మీ సంతానంలో ప్రయోజనం రీత్యా మీకు ఎవరు ఎక్కువ సన్నిహితులో మీకు తెలియదు. ఈ భాగాలను అల్లాహ్ నిర్ణయించాడు. నిశ్చయంగా అల్లాహ్ యథార్థాలన్నీ తెలిసినవాడు, మర్మాలన్నీ ఎరిగినవాడు.

*(ఖుర్ఆన్ 4: 11)*

మీ భార్యలకు సంతానం లేని పక్షంలో, వారు విడిచిపోయిన ఆస్తిలో మీకు అర్థభాగం లభిస్తుంది. కాని వారికి సంతానం ఉంటే అప్పుడు వారు విడిచివెళ్ళిన ఆస్తిలో మీకు నాలుగో భాగం లభిస్తుంది. ఇది వారు వ్రాసిపోయిన వీలునామా అమలు జరిపిన తరువాత, వారు చేసిపోయిన అప్పులు తీర్చిన తరువాత జరగాలి. మీకు సంతానం లేనిపక్షంలో మీరు విడిచిపోయే ఆస్తిలోని నాలుగో భాగానికి వారు (మీ భార్యలు) హక్కుదారులవుతారు. కాని మీరు సంతానవంతులైతే అప్పుడు వారికి ఎనిమిదో భాగం లభిస్తుంది. ఇది మీరు వ్రాసిన వీలునామాను అమలు జరిపిన తరువాత, మీరు చేసిన అప్పులు తీర్చిన తరువాత జరగాలి. (మరణించిన) పురుషుడు లేక స్త్రీ సంతాన హీనులై వారి తల్లిదండ్రులు కూడా జీవించి ఉండకపోతే, కాని వారికి ఒక సోదరుడు లేక ఒక సోదరి ఉంటే అప్పుడు వారిద్దరిలో ఒక్కొక్కరికి

ఆరో భాగం లభిస్తుంది. కాని సోదరీ సోదరులు ఒకరికంటే ఎక్కువ మంది ఉంటే అప్పుడు మొత్తం ఆస్తిలోని మూడో భాగానికి వారంతా భాగస్వాములవుతారు. మృతుడు వ్రాసిన వీలునామా అమలు జరిపిన తరువాత, అతడు చేసిన అప్పులు తీర్చిన తరువాత ఈ పంపిణీ జరగాలి. కాని ఇది (వారసులకు) నష్టం కలిగించేది కాకూడదు. ఇది అల్లాహ్ వైపు నుండి వచ్చిన ఆదేశం. అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, అత్యంత మృదు స్వభావుడు. ఇవి అల్లాహ్ విధించిన హద్దులు. అల్లాహ్‌కూ ఆయన ప్రవక్తకూ విధేయత చూపేవాణ్ణి అల్లాహ్, క్రింద సెలయేళ్ళు ప్రవహించే ఉద్యాన వనాలలో ప్రవేశింపజేస్తాడు. ఆ వనాలలో అతడు కలకాలం ఉంటాడు. అసలు ఇదే గొప్ప సాఫల్యం. అల్లాహ్‌కూ ఆయన ప్రవక్తకూ అవిధేయత చూపుతూ అల్లాహ్ విధించిన హద్దులను అతిక్రమించేవాణ్ణి అల్లాహ్ అగ్నిలో పడవేస్తాడు. అందులో అతడు సదా ఉంటాడు. అతనికి మిక్కిలి అవమానకరమైన శిక్ష పడుతుంది. ***(ఖుర్‌ఆన్ 12-14)***

ప్రవక్తా! ప్రజలు నిన్ను "కలాలా" విషయంలో ధార్మిక తీర్పు అడుగుతున్నారు. అల్లాహ్ మీకు ఈ ధార్మిక తీర్పు ఇస్తున్నాడు అని చెప్పు. ఒక మనిషి గనక సంతానం లేకుండా మరణిస్తే, అతనికి ఒక సోదరి ఉంటే, అప్పుడు ఆమె అతని ఆస్తిలో సగభాగం పొందుతుంది. సోదరి గనక సంతానం లేకుండా మరణిస్తే ఆమె సోదరుడు ఆమెకు వారసుడవుతాడు. ఒకవేళ మృతునికి (వారసులు) ఇద్దరు సోదరీమణులైతే, వారు అతని ఆస్తిలోని మూడింట రెండు భాగాలకు హక్కుదారులు అవుతారు. ఒకవేళ సోదరీ సోదరులు అనేకులు ఉన్నట్లయితే, అప్పుడు స్త్రీలకు ఒక వంతు పురుషులకు రెండు వంతులు లభిస్తాయి. అల్లాహ్ మీ కొరకు తన ఆజ్ఞలను విశదపరుస్తున్నాడు- మీరు మార్గం తప్పి తిరగకుండా ఉండేందుకు. అల్లాహ్‌కు ప్రతి విషయమూ తెలుసు.

***(ఖుర్‌ఆన్ 4: 176)***

## అధ్యాయం - 8

# ఖుర్‌ఆన్‌లో అనుసరణీయమైన సదాచారాలు

### ఎవరినీ వేళాకోళం చేయవద్దు, నిందించవద్దు అనే ఆజ్ఞ

విశ్వాసులారా! పురుషులు ఇతర పురుషులను ఎగతాళి చేయకూడదు. వీరికంటే వారే శ్రేష్ఠులై ఉండవచ్చు. అలాగే స్త్రీలు ఇతర స్త్రీలను ఎగతాళి చేయకూడదు. వీరికంటే వారే శ్రేష్ఠురాండ్రయి ఉండవచ్చు. ఒకరినొకరు ఎత్తిపొడుచుకోకండి, ఒకరినొకరు చెడ్డ పేర్లతో పిలుచు కోకండి. విశ్వసించిన తరువాత చెడ్డతనంలో పేరు సంపాదించటం చాలా నీచమైన విషయం. ఈ వైఖరిని మానుకోనివారే దుర్మార్గులు.

*(ఖుర్‌ఆన్ 49: 11)*

విశ్వాసులారా! అతిగా అనుమానించటం మానివేయండి. కొన్ని అను మానాలు పాపాలు అవుతాయి. గూఢచారులుగా వ్యవహరించకండి. మీలో ఎవరూ ఎవరినీ పరోక్షంగా నిందించరాదు. మీలో ఎవరైనా మీ మృత సోదరుని మాంసం తినటానికి ఇష్టపడతారా? చూడండి, మీరే స్వయంగా దీనిని అసహ్యించుకుంటారు. అల్లాహ్‌కు భయ పడండి, అల్లాహ్ అత్యధికంగా పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడు, కరుణించేవాడూను. *(ఖుర్‌ఆన్ 49: 12)*

### అనాథలను అన్యాయానికి గురిచేయవద్దు అనే ఆజ్ఞ

అనాథలై తమ ధనాన్ని, వస్తువులను తమ స్థిరాస్తులను కాపాడుకోలేని, ఎవరూ దిక్కుదివాణం లేనివారిని హింసించవద్దు. వారి ధనముకై ఆశించవద్దు. అట్టి వారికి రక్షణగా ఉండి వారిని వారి ఆస్తిపాస్తులను రక్షించు. అప్పుడే నీవు ఉత్తమ ముస్లిముగా అల్లాహ్ ద్వారా కీర్తించబడతావు. ఆశీర్వదించబడతావు.

**అనాథుల ఆస్తి దరిదాపులకు పోకండి, ఉత్తమమైన రీతిలో తప్ప-వారు యుక్త వయస్సుకు చేరేవరకు.** ***(ఖుర్‌ఆన్ 6: 152)***

ఇంకా ఖుర్‌ఆన్ ద్వారా అల్లాహ్ ఇలా తన ఆజ్ఞను పంపివున్నాడు.

**అనాథుల ఆస్తిని వారికి తిరిగి ఇవ్వండి. వారి మంచి వస్తువులను మీ చెడ్డ వస్తువులతో మార్చకండి. వారి ఆస్తిని మీ ఆస్తితో కలిపి కబళించకండి. ఇది మహాపాపం.** ***(ఖుర్‌ఆన్ 4 : 2)***

ఇంకనూ దివ్యఖుర్‌ఆన్ ఇలా ఆజ్ఞ ఇచ్చుచున్నది.

**అనాథులకు పెళ్ళి ఈడు వచ్చేవరకు వారిని అజమాయిషీ చేస్తూ ఉండండి, వారిలో మీకు యోగ్యత కనిపించినప్పుడు వారి ఆస్తిని వారికి అప్పగించండి. వారు పెద్దవారై తమ హక్కును కోరుతారేమో అని భయపడి వారి ఆస్తిని న్యాయసీమలను అతిక్రమించి తొందర తొందరగా ఎన్నడూ తినకండి. అనాథుల సంరక్షకుడు సంపన్నుడైతే, అతడు వారి సొమ్ముకు దూరంగా ఉండాలి. ఒకవేళ అతడు పేదవాడైతే దాన్ని ధర్మసమ్మతంగా అనుభవించాలి. తరువాత వారి ఆస్తిని వారికి అప్పగించేటప్పుడు దానికి ఇతరులను సాక్షులుగా పెట్టండి. లెక్క తీసుకోవటానికి అల్లాహ్ చాలు.** ***(ఖుర్‌ఆన్ 4: 6)***

**ఆస్తి పంపకం జరిగేటప్పుడు ఇతర బంధువులు, అనాథులు, నిరుపేదలు వస్తే, ఆ ఆస్తి నుండి వారికి కూడా కొంత ఇవ్వండి. వారిని మంచి మాటలతో పలుకరించండి.** ***(ఖుర్‌ఆన్ 4: 8)***

**ప్రజలు ఈ విషయాన్ని గురించి ఆలోచించి భయపడాలి: ఒకవేళ వారే తమ పిల్లలను నిస్సహాయులుగా విడిచిపెట్టి వెళ్ళవలసి వస్తే మరణ సమయంలో వారు ఆ పిల్లలను గురించి ఎంతగా ఆందోళన చెందేవారో! కనుక వారు అల్లాహ్‌కు భయపడాలి. న్యాయం పలకాలి.** ***(ఖుర్‌ఆన్ 4: 9)***

**అనాథుల ఆస్తిని అన్యాయంగా తినేవారు వాస్తవానికి తమ పొట్టలను అగ్నితో నింపుకుంటారు. వారు తప్పకుండా మండే నరకాగ్నిలో త్రోయ బడతారు.** ***(ఖుర్‌ఆన్ 4: 10)***

**సక్రమమైన పద్ధతిలో తప్ప అనాథుని సొమ్ము జోలికి పోకండి, అతడు యుక్త వయసునకు చేరేవరకు. చేసిన వాగ్దానాన్ని నెరవేర్చండి. నిస్సం దేహంగా వాగ్దానం విషయంలో మీరు సమాధానం చెప్పవలసి ఉంటుంది.** ***(ఖుర్ఆన్ 17: 34)***

## స్వలింగ సంపర్కం (Homo Sexuality) సమాజ వినాశానికి హేతువు

నేటి సమాజంలో ఇంకా అనేకానేక సామాజిక రుగ్మతలు, సమాజాన్ని పట్టి పీడిస్తూనే ఉన్నాయన్న విషయం అందరూ ఏకత్వంతో ఒప్పుకోవాల్సిందే. అశ్లీలతకు సంబంధించినవి వీటిలో ఎన్నో ఉన్నాయి. అల్లాహ్ సత్సంతానం కోసం స్త్రీ పురుష సమాగమం పవిత్రంగా ఏర్పాటు చేశాడు. అది నేడు వెర్రితలలు వేసి స్వలింగ సంపర్కం అనే అత్యంత అనారోగ్య అశ్లీలతతో నిండిన చెడు నడత వైపు దారితీసింది. ఆరోగ్యపరంగాను, ఇంకా సామాజిక, అనారోగ్య రీతులవైపు మానవులను తీసుకు వెళ్తూ మగను మగ, ఆడను ఆడ పెళ్ళాడే హక్కుల కోసం కోర్టుల వైపు పడుతున్న అడుగులు సామాజిక వినాశనానికి దారి తీస్తున్నాయి.

అందుచేతనే పరమ ప్రభువు అయిన అల్లాహ్ ఈ దివ్య కుర్ఆన్ ద్వారా దీన్ని సహేతుకంగా విమర్శించి, విడనాడమని ఆజ్ఞాపించాడు.

**లూత్‌ను మేము ప్రవక్తగా చేసి పంపాము. జ్ఞాపకం తెచ్చుకో అతను తన జాతితో ఇలా అన్నాడు: "మీరు ఇంత సిగ్గులేనివారై పోయారేమిటి, మీకు పూర్వం ప్రపంచంలో ఎవ్వడూ చెయ్యని బూతు పని చేస్తున్నారు? మీరు స్త్రీలను వదలి పురుషులతో మీ కామాన్ని తీర్చుకుంటున్నారు? వాస్తవానికి మీరు పూర్తిగా హద్దుమీరి ప్రవర్తించేవారు"**

***(ఖుర్ఆన్ 7: 80,81)***

## ఆకలి బాధ అందరికీ తెలిసి రావాలి. అందుకే ఉపవాసం ఆజ్ఞ

ప్రపంచంలో ఆకలి తీరి సంతోషంతో ఉండువారు అతి తక్కువ. ఆకలి తీర్చుకునే ప్రయత్నంలోనే మానవులు చేయరాని తప్పిదాలు చేస్తూ వారి వారి పాపాల చిట్టాను పెంచుకొంటున్నారు. అట్టి వారు అల్లాహ్ అంతిమ తీర్పు రోజు ఏమి సమాధానం చెప్పినను ఆయన ఒప్పుకోడు.

ఆకలి బాధ తెలిసినవారికే ఇతరుల ఆకలి బాధ, దానిని తీర్చవలసిన బాధ్యత ఎంత గొప్పదో తెలుస్తుంది.

**విశ్వసించిన ప్రజలారా! ఉపవాసం మీకు విధిగా నిర్ణయించబడింది– ఏ విధంగా మీకు పూర్వం ప్రవక్తలను అనుసరించేవారికి కూడా విధించబడిందో. దీనివల్ల మీలో భయభక్తులు జనించే అవకాశం ఉంది.** ***(ఖుర్‌ఆన్ 2: 183)***

## ద్రోహం చేయకండి

అల్లాహ్ ద్వారా ఖుర్‌ఆన్‌లో ఇవ్వబడిన మరో ఆజ్ఞ. పరుల సొమ్మును మింగినచో శిక్షకు గురి అనే ఆజ్ఞ

**విశ్వసించిన ప్రజలారా! ఒకరి సొమ్మును మరొకరు అధర్మంగా తినకండి. ఇచ్చిపుచ్చుకోవటం జరగవలసిందే, అయితే పరస్పర అంగీకారంతో. మిమ్మల్ని మీరు చంపుకోకండి. అల్లాహ్‌కు మీరంటే ఎంతో దయ అని నమ్మండి. హింసా దౌర్జన్యాల ద్వారా అలా చేసేవాణ్ణి మేము తప్పకుండా అగ్నిలో పడవేస్తాము. ఇది అల్లాహ్‌కు అంత కష్టమైన పని కాదు.** ***(ఖుర్‌ఆన్ – 4: 29,30)***

**మీకు నిషేధించబడినటువంటి మహా పాపాలకు గనక మీరు దూరంగా ఉంటే, మీ చిన్న చిన్న దోషాలను మేము మీ లెక్క నుండి తీసివేస్తాము. మిమ్మల్ని గౌరవస్థానాల్లో ప్రవేశింపజేస్తాము.** ***(ఖుర్‌ఆన్ 4: 31)***

**ముస్లిములారా! "అమానతులను యోగ్యులైన వారికి అప్పగించండి. ప్రజల మధ్య తీర్పు చెప్పేటప్పుడు న్యాయంగా చేయండి" అని అల్లాహ్ మిమ్మల్ని ఆజ్ఞాపిస్తున్నాడు. అల్లాహ్ మీకు ఎంతో చక్కని హితబోధ చేస్తున్నాడు. నిశ్చయంగా ఆయన అన్నీ వింటాడు, అన్నీ చూస్తాడు.** ***(ఖుర్‌ఆన్ 4: 58)***

**నమ్మకద్రోహి, నిత్య పాపి అయిన మనిషిని అల్లాహ్ ప్రేమించడు.** ***(ఖుర్‌ఆన్ 4: 107)***

## ఖుర్ఆన్ ప్రకారం ఎవరైనా నిర్దోషులను శిక్షలో ఇరికించటం పాపం

ఎవడైనా ఏదైనా నేరంగాని లేక పాపం గాని చేసి, ఆ నిందను ఏ నిర్దోషిపైనైనా మోపితే అతడు తీవ్రమైన అపనిందను, ఘోరపాతకాన్ని మూటగట్టుకుంటాడు. *(ఖుర్ఆన్ 4: 112)*

## తల్లిదండ్రులతోనూ ఇరుగు పొరుగులతోను సద్వర్తనతో నుండుమని ఆజ్ఞ

మీరంతా అల్లాహ్‌కు దాస్యం చెయ్యండి. ఎవరినీ ఆయనకు భాగ స్వాములుగా చేయవద్దు. తల్లిదండ్రుల ఎడల సద్భావంతో మెలగండి. బంధువులూ, అనాథులూ, నిరుపేదల పట్ల మంచిగా వ్యవహరించండి. పొరుగున ఉన్న బంధువులు, అపరిచితులయిన పొరుగువారు, ప్రక్కనున్న మిత్రులు, బాటసారులు, మీ అధీనంలో ఉన్న దాసదాసీ జనం పట్ల ఉదార బుద్ధితో వ్యవహరించండి. గర్వాతిశయంతో కన్నూమిన్నూ కాననివారు, తమ గొప్పతనం గురించి విర్రవీగేవారు అంటే అల్లాహ్ ఇష్టపడదు అని గట్టిగా నమ్మండి. *(ఖుర్ఆన్ 4: 36)*

## తల్లిదండ్రులతో సద్వర్తన

తల్లిదండ్రులతో మంచిగా ప్రవర్తించండి. *(ఖుర్ఆన్ 6: 151)*

నీ ప్రభువు ఇలా నిర్ణయం చేశాడు : మీరు కేవలం ఆయనను తప్ప మరెవరినీ ఆరాధించకండి. తల్లిదండ్రులతో మంచితనంతో వ్యవహ రించండి. ఒకవేళ మీవద్ద వారిలో ఒకరుగాని ఇద్దరు గాని ముసలివారై ఉంటే, వారి ముందు విసుగ్గా 'ఛీ' అని కూడా అనకండి. వారిని కసురుకుంటూ సమాధానం ఇవ్వకండి. వారితో మర్యాదగా మాట్లా డండి. మృదుత్వమూ, దయాభావమూ కలిగి వారి ముందు వినమ్రులై ఉండండి. ఇలా ప్రార్థిస్తూ ఉండండి: "ప్రభూ! వారిపై కరుణ జూపు, బాల్యంలో వారు నన్ను కారుణ్యంతో, వాత్సల్యంతో పోషించినట్లు". *(ఖుర్ఆన్ 17: 23,24)*

## చెప్పింది, చేయాలి

విశ్వాసులారా! మీరు చేయని విషయాన్ని చేస్తాము అని చెబుతారెందుకు? మీరు చేయని దానిని చేస్తాము అని చెప్పటం

అల్లాహ్ దృష్టిలో అత్యంత అప్రియమైన విషయం. *(ఖుర్ఆన్ 61: 2,3)*

## సంతాన హత్య మహాపాపం

పేదరికానికి భయపడి మీ సంతానాన్ని హత్య చేయకండి. మేము మీకూ ఉపాధినిస్తున్నాము. వారికీ ఇస్తాము. *(ఖుర్ఆన్ 6: 151)*

## దుబారా ఖర్చు మంచిది కాదు

"బంధువుల పట్ల మీ విధులను నిర్వహించండి. పేదవారిపట్ల, బాటసారుల పట్ల మీ విధులను నిర్వర్తించండి. వృథాఖర్చు చేయకండి. వృథా ఖర్చు చేసేవారు షైతాన్ సోదరులు." *(ఖుర్ఆన్ 17: 26, 27)*

మీ చేతిని మెడకు బంధించీ ఉంచకండి, దానిని పూర్తిగా స్వేచ్ఛగానూ వదలి పెట్టకండి. అలా చేస్తే నిందల పాలవుతారు, దిక్కులేని వారవుతారు. *(ఖుర్ఆన్ 17: 29)*

## సత్కార్యాలలో పిసినారితనం నరకమార్గం

పిసినారితనంతో ప్రవర్తిస్తూ ఇతరులక్కూడా పిసినారితనాన్ని గరపే వారిని, అల్లాహ్ తన అనుగ్రహంతో ఇచ్చిన దాన్ని దాచి పెట్టేవారిని కూడా అల్లాహ్ ప్రేమించడు. మా అనుగ్రహాలను తిరస్కరించే ఇటువంటి వారి కొరకు మేము అవమానకరమైన శిక్షను సిద్ధపరచి ఉంచాము. *(ఖుర్ఆన్ 4: 37)*

## ప్రదర్శనాబుద్ధి అధర్మం

"కేవలం ప్రజలకు చూపటానికి తమ సంపదను ఖర్చుపెట్టేవారు, అల్లాహ్‌ను అంతిమ దినాన్ని హృదయపూర్వకంగా విశ్వసించని వారు అంటే కూడా అల్లాహ్‌కు అనిష్టమే. యదార్థమేమిటంటే షైతాన్ ఎవడి స్నేహితుడయ్యాడో వాడికి దుస్సాంగత్యం లభించినట్లే. "

*(ఖుర్ఆన్ 4: 38)*

## కొలతలు, తూనికల్లో న్యాయంగా వ్యవహరించాలి

కొలపాత్రతో ఇస్తే, పూర్తిగా నింపి ఇవ్వండి, తూచినట్లయితే సరైన తరాజుతో తూచండి. ఇది మంచి పద్ధతి *(ఖుర్ఆన్ 17: 35)*

## తెలియని విషయాల వెంట పడకండి

**మీకు తెలియని విషయం వెంటపడకండి. నిశ్చయంగా కళ్ళూ, చెవులూ, మనస్సూ అన్నింటి విషయంలోనూ విచారణ జరుగుతుంది.**

***(ఖుర్ఆన్ 17: 35,36)***

## అనుమతి లేకుండా ఇతరుల ఇండ్లల్లోకి ప్రవేశించకండి

**విశ్వసించిన ప్రజలారా! మీ ఇళ్లల్లోకి తప్ప ఇతరుల ఇళ్లల్లోకి ప్రవేశించకండి, ఇంటి వారి అంగీకారం పొందనంత వరకు, ఇంటి వారికి సలామ్ చేయనంతవరకు. ఈ పద్ధతి మీకు ఎంతో ఉత్తమమైనది. దీనిని మీరు పాటిస్తారని ఆశించబడుతోంది. ఇంకా ఒకవేళ అక్కడ మీరు ఎవరినీ కనుగొనకపోతే, మీకు అనుమతి ఈయబడనంత వరకు ప్రవేశించకూడదు. ఒకవేళ, తిరిగి వెళ్లిపొమ్మని మీతో అంటే, తిరిగి వెళ్ళిపోండి. ఇది మీకు ఎంతో పరిశుద్ధమైన పద్ధతి. మీరు ఏది చేస్తారో, అది అల్లాహ్‌కు బాగా తెలుసు.** ***(ఖుర్ఆన్ 24: 27, 28)***

## సత్యం ఎప్పుడూ అసత్యం మీద గెలుపు సాధిస్తుంది

ఇలా ప్రకటించు : "సత్యం వచ్చేసింది. అసత్యం నశించింది. అసత్యం నశించక తప్పదు." ***(ఖుర్ఆన్ 17: 81)***

## దైవ సంప్రదాయం

మనిషి ఏ విత్తనం నాటితే అదే ఫలం లభిస్తుంది. అసలు ఏమీ చేయనివారు దేనినీ పొందరు–

**యథార్థం ఏమిటంటే, ఒక జాతి స్వయంగా తన లక్షణాలను మార్చుకోనంత వరకు అల్లాహ్ దాని స్థితిని మార్చడు. అల్లాహ్ ఒక జాతిని తన శిక్షకు గురి చేసే నిర్ణయం తీసుకున్నప్పుడు, దానిని ఎవరు తొలగించదలచుకున్నా అది తొలగదు; అల్లాహ్‌కు ప్రతికూలంగా అటువంటి జాతిని రక్షించేవాడూ, ఆదుకునేవాడూ ఎవడూ ఉండడు.**

***(ఖుర్ఆన్ 13: 11)***

## లంచగొండితనం

ఒకరికి లంచం ఇవ్వవద్దని, ఒకరి సొమ్మును అన్యాయంగా స్వాహా చేయరాదని అల్లాహ్ ఆదేశించాడు :

**మీలో మీరు ఒకరి ఆస్తిని మరొకరు అన్యాయంగా కబళించకండి. బుద్ధిపూర్వకంగా, అక్రమమైన రీతిలో ఇతరుల ఆస్తిలో కొంత భాగం కాజేసే అవకాశం లభిస్తుందేమో అనే దురుద్దేశ్యంతో దానిని న్యాయ నిర్ణేతల వద్దకు తీసుకొని పోకండి.** ***(ఖుర్ఆన్ 2: 188)***

## మనిషి స్వభావం

**మానవుడి స్థితి ఎలాంటిదంటే; అతడికి కష్టకాలం దాపురించినప్పుడు నిలబడీ, కూర్చుండీ, పరుండీ మాకు మొరపెట్టుకుంటాడు. కాని మేము అతడి ఆపదను తొలగించినప్పుడు అతడు ఎప్పుడూ తనకు కలిగిన ఏ గడ్డు కాలంలోనూ మాకు మొరపెట్టుకోనేలేదు అనే విధంగా ప్రవర్తిస్తాడు. ఈ విధంగా మితిమీరి ప్రవర్తించేవారికి వారి చేష్టలు ఆకర్షకములుగా చెయ్యబడ్డాయి.** ***(ఖుర్ఆన్ 10: 12)***

## ఖుర్ఆన్ ప్రకారం ప్రాపంచిక జీవనానికి ఎక్కువ ప్రాముఖ్యత లేదు

**స్త్రీలూ, సంతానమూ, వెండి బంగారు రాసులూ, మేలు జాతి గుర్రాలూ, పశువులూ, సేద్యపు భూములూ వంటి వ్యామోహాలపై ప్రేమ ఆకర్షకంగా చెయ్యబడింది. కాని ఇవన్నీ అనిత్యమైన ఐహిక జీవన సంపదలు మాత్రమే. అసలైన ఉత్తమ నివాసం అల్లాహ్ వద్ద ఉన్నదే.** ***(ఖుర్ఆన్ 3: 14)***

**వారు పరలోక జీవితం కంటే ఇహలోక జీవితానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. వారు ప్రజలను అల్లాహ్ మార్గం నుండి వారిస్తారు. వారు ఈ మార్గం (తమ కోరికలకు అనుగుణంగా) వక్రమైనదిగా కావాలని కోరుతున్నారు. వారు మార్గభ్రష్టత్వంలో చాలా దూరం వెళ్ళి పోయారు.** ***(ఖుర్ఆన్ 14: 3)***

**బాగా తెలుసుకోండి, ఈ లౌకిక జీవితం ఒక ఆట, ఒక వినోదం, బాహ్య పటాటోపం, పరస్పరం ప్రగల్భాలు పలకటం, సంపద, సంతా నాల విషయంలో ఒకరిపై ఒకరు ఆధిక్యం పొందటానికి ప్రయత్నిం**

చటం తప్ప మరేమీ కాదు. దాని దృష్టాంతం ఇలా ఉంది: ఒక వర్షం కురిసింది. అప్పుడు దాని వల్ల మొలకెత్తి పెరిగిన చెట్లూ చేమలను చూచి, రైతులు సంబరపడ్డారు. తరువాత అవే పండుతాయి. ఆ తరువాత అవి పసుపుపచ్చగా మారిపోవటాన్ని నీవు చూస్తావు, ఆపై అవి ఎండిపోయి పొట్టుగా మారిపోతాయి. దీనికి భిన్నంగా, పరలోకం ఇలా ఉంటుంది : అక్కడ తీవ్రమైన శిక్ష ఉంటుంది. అల్లాహ్ క్షమాభిక్ష, ఆయన ప్రసన్నత ఉంటాయి. ప్రాపంచిక జీవితం ఒక మాయ తడిక తప్ప మరేమీ కాదు. ***(ఖుర్ఆన్ 57: 20)***

## విర్రవీగేవారిని అల్లాహ్ ఇష్టపడడు

గర్వాతిశయంతో కన్నూమిన్నూ కాననివారు, తమ గొప్పతనం గురించి విర్రవీగేవారు అంటే అల్లాహ్ ఇష్టపడడు అని గట్టిగా నమ్మండి.

***(ఖుర్ఆన్ 4: 36)***

అహంభావానికి గురైన వారిని ఆయన ఏమాత్రం ప్రేమించడు.

***(ఖుర్ఆన్ 16: 23)***

## ఆడ మగ సంతానం మధ్య తేడా చూపుట అల్లాహ్‌కు అయిష్టం

వారిలో ఎవడికైనా కూతురు పుట్టినదనే శుభవార్తను అందజేస్తే అతడి ముఖాన్ని నల్లని ఛాయలు ఆవరిస్తాయి. అతడు లోలోన కుమిలి పోతాడు. ఈ దుర్వార్త విన్న తరువాత ఇక లోకులకు ఎలా ముఖం చూపాలి అని అతడు నక్కి నక్కి తిరుగుతూ ఉంటాడు. అవమానాన్ని భరిస్తూ కూతుర్ని ఇంట్లో ఉంచుకోవాలా లేక ఆమెను మట్టిలో పాతి పెట్టాలా? అని ఆలోచిస్తాడు–చూడు! వారు దేవుని విషయంలో చేసే నిర్ణయాలు ఎంత దుష్టమైనవో! ***(ఖుర్ఆన్ 16: 58,59)***

## ప్రార్థనా సమయంలో అమ్ముట, కొనుట వంటివి ఆపమని దైవాజ్ఞ

విశ్వాసులారా! శుక్రవారం నాడు నమాజుకై పిలిచినప్పుడు, అల్లాహ్ సంస్మరణ వైపునకు పరుగెత్తండి; క్రయ విక్రయాలను వదిలిపెట్టండి. మీరు గ్రహించగలిగితే, ఇదే మీకు అత్యంత శ్రేయస్కరమైనది.

***(ఖుర్ఆన్ 62: 9)***

## మహిళల గౌరవం, మర్యాద నిలిపేది పరదా అని గుర్తెరగమని ఆజ్ఞ

స్త్రీలను చెడ్డ దృష్టితో చూడటం, స్త్రీలతో అశ్లీలంగా పనులు చేయడం వారి మర్యాదను, గౌరవాన్ని నష్టపరిచే విధంగా ఎట్టి చెడు కార్యాలు చేసినా దానికి ఒక పెద్ద కారణం పరదా లేకపోవటం. ఇట్టి అకృత్యాల నుంచి మనల్ని మన స్త్రీలను రక్షించుకునే అస్త్రం స్త్రీల పరదాగా భావిస్తూ స్త్రీల మర్యాదను రక్షించే పరదాను పవిత్ర దృష్టితో చూడవలసినదిగా పవిత్ర ఖుర్‌ఆన్ ద్వారా అల్లాహ్ ఆజ్ఞాపిస్తున్నాడు.

> **ప్రవక్తా! నీ భార్యలకూ, నీ కూతుళ్ళకూ, విశ్వాసుల స్త్రీలకూ తమ దుప్పట్ల కొంగులను తమపై వ్రేలాడదీసుకోమని చెప్పు; వారు గుర్తింప బడటానికీ, వేధింపబడకుండా ఉండేందుకూ ఇది ఎంతో సముచితమైన పద్ధతి. అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడూను.**
>
> ***(ఖుర్‌ఆన్ 33: 59)***

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్

## అధ్యాయం - 9

# అల్లాహ్ నియమాలకు కట్టుబడే వారికే స్వర్గ ప్రవేశం

ఇస్లాంని అనుసరించి ఒకరోజు ఈ భూమిపై ప్రళయం వచ్చునని, దాని ఫలితంగా ఈ భూమిపై ఏ జీవ జంతువులు, ఏ వస్తువులు అనగా ఏమియు మిగలవని తెలియజేయబడినది. ఆ తరువాత అన్ని విషయాలను అల్లాహ్ తన చేతులలోనికి తీసుకొంటాడని, మొత్తం మానవులందరికీ వారి పాప పుణ్యాలనను సరించి వారికి శిక్షలు లేక స్వర్గవనాలు ఇవ్వబడతాయని ఖుర్ఆన్ ద్వారా తెలియజేయ బడింది. ఇస్లాంలో ఆ తీర్పు దినమే అంతిమ తీర్పుదినంగా పేర్కొనబడింది.

**భయభక్తులు కలవారి కొరకు వారి ప్రభువు వద్ద ఉద్యాన వనాలు ఉన్నాయి. వాటి క్రిందుగా కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడ వారికి శాశ్వతమైన జీవితం లభిస్తుంది. పరిశుద్ధ చరితలైన భార్యల సాంగత్యం లభిస్తుంది. అల్లాహ్ సమ్మతి లభిస్తుంది. అల్లాహ్ తన దాసుల నడవడికను శ్రద్ధతో గమనిస్తాడు.** ***(ఖుర్ఆన్ 3: 15)***

**మంచి పనులు చేసేవారు– పురుషులైనా స్త్రీలైనా– వారు గనక విశ్వాసులైతే స్వర్గంలో ప్రవేశిస్తారు. వారికి రవ్వంత అన్యాయం కూడా జరగదు.** ***(ఖుర్ఆన్ 4: 124)***

**ఇదీ యథార్థమే. విశ్వసించి (అంటే ఈ గ్రంథంలో తెలుపబడిన సత్యాలను స్వీకరించి), మంచి పనులు చేస్తూ ఉండినవారిని వారి ప్రభువు వారి విశ్వాసం కారణంగా సరియైన మార్గంపై నడుపుతాడు. భోగభాగ్యాలతో నిండివున్న స్వర్గవనాలలో. వాటి క్రింది కాలువలు ప్రవహిస్తాయి.** ***(ఖుర్ఆన్ 10:9)***

అక్కడ వారు దైవమా! నీవు పవిత్రుడవు అని స్తుతిస్తారు. శాంతి కలుగుగాక అని ప్రార్థిస్తారు. వారి ప్రతి మాటకు ముగింపు ఇలా ఉంటుంది: స్తోత్రమంతా సకల లోకాల ప్రభువైన అల్లాహ్‌కు మాత్రమే.
*(ఖుర్ఆన్ 10: 10)*

మరోవైపు దైవభీతి కలవారిని, మీ ప్రభువు తరఫు నుండి అవతరించి నటువంటిది ఏమిటి? అని అడిగినప్పుడు, వారు "అత్యుత్తమమైనది అవతరించినది" అని సమాధానం చెబుతారు. ఇటువంటి సజ్జనులకు ఈ ప్రపంచంలోనూ మేలు జరుగుతుంది. ఇక పరలోక గృహం కూడా తప్పనిసరిగా వారికి ఎంతో మేలైనదిగా ఉంటుంది. భయ భక్తులు కలవారి ఇల్లు ఎంతో మంచి ఇల్లు, శాశ్వత నివాసంగా ఉండే ఉద్యానవనాలు- వాటిలో వారు ప్రవేశిస్తారు. *(ఖుర్ఆన్ 16: 30)*

అక్కడ అంతా వారి అభిమతానికి అనుగుణంగానే జరుగుతుంది. భయభక్తులు కలవారికి అల్లాహ్ ఇటువంటి ప్రతిఫలాన్ని ఇస్తాడు. వారు పరిశుద్ధావస్థలో ఉన్నప్పుడు దైవదూతలు వారి ప్రాణాలు తీస్తూ "మీకు శాంతి కలుగుగాక! మీ కర్మలకు ప్రతిఫలంగా స్వర్గంలో ప్రవేశించండి" అని అంటారు. *(ఖుర్ఆన్ 16 : 31)*

విశ్వసించి సత్కార్యాలు చేసేవారి విషయం- మేము నిశ్చయంగా వారి ప్రతిఫలాన్ని వృధా చేయము. *(ఖుర్ఆన్ 18: 31)*

ఆయన సాన్నిధ్యంలో విశ్వాసిగా హాజరు అయి, సత్కార్యాలు చేసి ఉన్నవాడు- అలాంటి వారందరికీ ఉన్నత స్థానాలు ఉన్నాయి. నిత్యం పచ్చగా ఉండే ఉద్యాన వనాలు ఉన్నాయి. వాటి క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. వాటిలో వారు శాశ్వతంగా ఉంటారు. పరిశుద్ధతను పాటించే వ్యక్తికి లభించే ప్రతిఫలం ఇదే.

*(ఖుర్ఆన్ 20: 75,76)*

అయితే, ఎన్నుకోబడిన దైవదాసులు మాత్రం (ఈ దుష్ఫలితానికి గురికాకుండా) సురక్షితంగా ఉంటారు. వారి కొరకు అందరూ ఎరిగిన ఆహారమే ఉన్నది, రుచికరమైన అన్ని రకాల పదార్థాలు ఉన్నాయి.

భోగభాగ్యాలతో విలసిల్లే ఉద్యాన వనాలు ఉన్నాయి. అందు వారు సగౌరవంగా ఉంచబడతారు. సోఫాలపై ఎదురెదురుగా కూర్చుంటారు. మద్యపు చెలమల నుండి పాత్రలు మాటిమాటికి నింపబడి వారి మధ్య త్రిప్పబడతాయి. మెరిసిపోతున్న మధువు, త్రాగేవారికి అది ఎంతో మధురం. దానివల్ల వారి శరీరానికి నష్టం ఉండదు, వారి బుద్ధీ చెడిపోదు. వారి దగ్గర తమ చూపులను నిగ్రహించుకునే అంద మైన కళ్ళు గల స్త్రీలు ఉంటారు. వారు గుడ్డు గుల్ల క్రింద దాగి ఉండే పొరలాంటి కోమలాంగులు. ***(ఖుర్‌ఆన్ 37: 40-49)***

దైవభీతి గలవారు శాంతి భద్రతలు గల ప్రదేశంలో ఉంటారు. ఉద్యాన వనాలలో, సెలయేళ్ళలో, సన్నని పట్టు వస్త్రాలూ, జరీ పట్టు వస్త్రాలూ ధరించి, ఒకరికొకరు ఎదురుగా కూర్చుండి ఉంటారు. ఇలా ఉంటుంది వారి దర్పం. పసిమి రంగు మేనులూ, అందమైన విశాలమైన కళ్ళూ గల స్త్రీలను వారికి ఇచ్చి వివాహం చేస్తాము. అక్కడ వారు రుచికరమైన అన్ని రకాల పదార్థాలనూ నిస్సంకోచంగా అడుగుతారు.

***(ఖుర్‌ఆన్ 44: 51-55)***

భయభక్తులు కలవారు అక్కడ ఉద్యాన వనాలలో, భోగభాగ్యాలతో ఉంటారు. వారి ప్రభువు వారికి ఇచ్చే వాటిని హాయిగా అనుభవిస్తూ ఉంటారు. వారి ప్రభువు వారిని నరకశిక్ష నుండి రక్షించుకుంటాడు. (వారితో ఇలా అనబడుతుంది) "హాయిగా తినండి, త్రాగండి, మీరు చేస్తూ ఉండిన కర్మలకు ప్రతిఫలంగా, వారు వేయబడిన ఆసనాలపై దిండ్లకు ఆనుకుని ఎదురెదురుగా కూర్చొని ఉంటారు. మేము వారికి అందమైన కళ్ళు గల సుందరాంగులనిచ్చి వివాహం చేస్తాము. విశ్వా సుల సంతానం కూడా, విశ్వాసం విషయంలో దాదాపు వారి అడుగు జాడలలో నడిచి ఉంటే, వారి ఈ సంతానాన్ని కూడా మేము (స్వర్గంలో) వారితో కలుపుతాము. ఇంకా వారి కర్మలలో వారికి ఏమాత్రం నష్టం కలుగజేయుము. ప్రతి వ్యక్తీ తాను సంపాదించిన దానికి తాకట్టుగా

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్

**ఉన్నాడు. మేము వారు కోరిన విధంగా వారికి అన్ని రకాల పండ్లు, మాంసం పుష్కలంగా ఇస్తూ ఉంటాము. వారు ఒకరి నుండి ఒకరు మధుపాత్రలను అమితోత్సాహంతో అందుకుంటూ ఉంటారు. దానిని సేవించటం వల్ల ప్రేలాపనలూ ఉండవు, చెడు నడతా ఉండదు. వారి (సేవ) కొరకే ప్రత్యేకించబడిన, దాచబడిన ఆణిముత్యాల వంటి అందమైన బాలురు వారి సేవలో పరుగెడుతూ అటూ ఇటూ తిరుగుతూ ఉంటారు. వారు పరస్పరం (ప్రపంచంలో జరిగిన) పరిస్థితులను గురించి అడిగి తెలుసుకుంటారు. వారు, "మేము మొదట మా కుటుంబం వారి మధ్య (దేవునికి) భయపడుతూ జీవితం గడిపే వారం. చివరకు అల్లాహ్ మాపై కనికరం చూపాడు, మమ్మల్ని తీవ్రమైన వడగాలి శిక్ష నుండి రక్షించాడు. మేము గత జీవితంలో ఆయననే వేడుకుంటూ ఉండేవారము. ఆయన నిజంగానే మహోపకారి మరియు అనంత కరుణామయుడు."** ***(ఖుర్ఆన్ 52: 17-28)***

ఇలా స్వర్గ ప్రవేశం కొరకు సత్యం, శాంతి, ధర్మం, మానవత వంటి సద్గుణాలు అవసరం, వాటిని జీవన మార్గాలుగా చేసుకుని నిద్రలోను మెలకువలోను కూడా మరువక అనుసరించి అల్లాహ్ ఆఖరి తీర్పులో స్వర్గవాసం పొందు వారి జీవితాలు ఎంత గొప్పవో కదా! అట్టి వారి మార్గములో పయనించి అల్లాహ్‌ను సంతోషపరుచుట మనందరి ధర్మమే కదా! దాని సత్ఫలితాన్ని పొంది మన జీవన గమ్యాన్ని చేరవలసినదే కదా!

## అధ్యాయం - 10

# అల్లాహ్ నియమావళిని ఉల్లంఘిస్తే నరకమే

ఎలాగైతే అల్లాహ్ నియమావళి అనుసరణ ద్వారా స్వర్గప్రవేశం పొందుతారని తెలియజేయబడిందో అలాగే ఆయన నియమాల ఉల్లంఘనకు పర్యవసానం నరకమే. కరుణామయుడు అల్లాహ్ బోధించిన సత్యం, ధర్మం, శాంతి, అహింస, మానవత వంటి సిద్ధాంతాలకు వ్యతిరేకంగా జీవించేవారు ఆఖరి తీర్పు రోజు అల్లాహ్ ద్వారా శిక్షకు గురయ్యే తీరుతారు. ఈ శిక్ష ఎట్టి పరిస్థితులలోను తగ్గించబడదు లేదా రద్దు చేయబడదు అని తెలుసుకోవాలి.

మనందరి ఈశ్వరుడైన ఆ అల్లాహ్ విధించిన పరిమితులను ఎట్టి పరిస్థితుల లోనూ దాటరాదు. అవి పశు పక్ష్యాదులు కావచ్చు, చెట్టు చేమలు కావచ్చు. పర్వతాలు- నదులు కావచ్చు, సూర్యుడు- చంద్రుడు, భూమి కావచ్చు. ఎవరూ కూడా అల్లాహ్ విధించిన జీవన సూత్రాలను విడిచి చెడు మార్గంలో జీవన ప్రయాణం చేసి తనకే గాక తన చుట్టూ ఉన్నవారికి కష్టాలు, కన్నీళ్ళు కలిగించినచో అల్లాహ్ విధించు నరక జీవన విధానం నుంచి తప్పించుకొనుట కల్ల అని గుర్తెరిగి వారి వారి జీవన రీతిని మార్చుకొను ప్రయత్నం చేసి తీరవలెను.

కొందరికైతే అల్లాహ్ ద్వారా ప్రాప్తించిన సద్బుద్ధి వలన, వివేకం వలన ఈ ప్రపంచంలోని సత్యం, ధర్మం, శాంతి, మానవత వంటివి చక్కగా కనిపించి వాటి ఉపయోగం ఎలా, ఎక్కడ చేయవలెనో అల్లాహ్ ద్వారా చూపించబడ్డాయి.

అల్లాహ్ ద్వారా విధించబడిన ఇట్టి నియమాలు ఎవరైతే ఉల్లంఘించి, అత్యంత విశృంఖల జీవన మార్గంలో జీవించి అంతిమ తీర్పు రోజు అల్లాహ్ ముందు నిలబడె దరో వారికి వ్యధాభరిత శిక్ష ఉంటుంది. ఈ యాతన తగ్గించబడదు, క్షమించబడదు.

వారు ఈ బ్రహ్మాండంలోని ఎలెక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రన్ లేదా పరమాణువులు కూడా ఈ గెలాక్సీ గాని, చంద్రుడు గాని, సూర్యుడు గాని నక్షత్రములు గాని నియమాలు ఉల్లంఘిస్తే వాటిని కనిపించకుండానే చేయును అల్లాహ్. అనగా ఎవరైతే అల్లాహ్ మనందరి మంచి కొరకు విధించిన అత్యంత చెడు జీవన గమనంలో నడిచెదరో వారికి ఈ ప్రపంచంలో ఎచటనూ చోటు లేకుండా నశింపజేస్తాడు అల్లాహ్ అని మరువవద్దు.

అల్లాహ్ విధించిన నియమాలకు వ్యతిరేకంగా జీవించే వారికి ఆయన విధించే శిక్షలను దివ్య ఖుర్ఆన్ ఈ విధంగా తెలియజేసింది.

**స్పష్టంగా ఇలా ప్రకటించు; "ఇది సత్యం మీ ప్రభువు నుంచి వచ్చింది. ఇష్టమైన వారు దానిని స్వీకరించనూ వచ్చు, ఇష్టం కాని వారు దానిని తిరస్కరించనూ వచ్చు. మేము (సత్యాన్ని తిరస్కరించే) దుర్మార్గుల కొరకు ఒక అగ్నిని సిద్ధపరచి ఉంచాము, దాని జ్వాలలు వారిని చుట్టుముట్టుతాయి. అక్కడ వారు గనక మంచినీళ్ళు అడిగితే, నూనె మడ్డిలాంటి నీటితో వారిని సత్కరించటం జరుగుతుంది. అది వారి ముఖాలను మాడుస్తుంది. అది ఎంత జుగుప్సాకరమైన పానీయం! ఇది ఎంత నికృష్టమైన విశ్రాంతి స్థలం!** ***(ఖుర్ఆన్ 18: 29)***

**అవిశ్వాస వైఖరిని అవలంబించిన వారికి, వారి ఐశ్వర్య బలంకాని, సంతాన బలం కాని అల్లాహ్‌కు ప్రతికూలంగా ఉపయోగపడవు. వారు నరకానికి ఇంధనం అయి తీరుతారు.** ***(ఖుర్ఆన్ 3: 10)***

**యథార్థం ఏమిటంటే మమ్మల్ని కలుసుకోవాలని ఆశించనివారూ ప్రాపంచిక జీవితమునే వరించి దానితోనే తృప్తి చెందినవారూ మా సూచనల పట్ల నిర్లక్ష్య భావం కలిగివున్నవారూ– అటువంటి వారి అంతిమ నివాస స్థలం నరకమే అవుతుంది. వారు (తమ ఈ తప్పుడు విశ్వాసం, తప్పుడు ప్రవర్తనల కారణంగా) చేస్తూ వచ్చిన చెడులకు ఫలితంగా.** ***(ఖుర్ఆన్ 10: 7,8)***

**భూమ్యాకాశాల రూపాలను పూర్తిగా మార్చటం జరిగే రోజును గురించి నీవు వారిని భయపెట్టు. అద్వితీయుడూ, రౌద్రుడూ అయిన**

అల్లాహ్ ముందు అందరూ హాజరవుతారు. ఆ రోజు నీవు దోషులను చూస్తావు. వారి చేతులూ, కాళ్ళూ బేడీలతో బంధించబడి ఉంటాయి. వారు తమ వస్త్రాలను ధరించి ఉంటారు. అగ్ని జ్వాలలు వారి ముఖాలను క్రమ్ముకుంటాయి. అల్లాహ్ ప్రతి వ్యక్తికీ అతను చేసిన దానికి ప్రతిఫలం ఇచ్చేందుకు ఇలా జరుగుతుంది. లెక్క తీసుకోవటానికి అల్లాహ్‌కు ఎంతో ఆలస్యం కాదు. *(ఖుర్‌ఆన్ 14 : 48-51)*

యథార్థం ఏమిటంటే, దోషిగా తన ప్రభువు ముందు హాజరయ్యే వాడికి నరకం తప్పదు. అందులో వాడు చావనూ లేడు, బ్రతకనూ లేడు. *(ఖుర్‌ఆన్ 20 : 74)*

వారు "నీవు సత్యవంతుడవే అయితే, అసలు ఈ బెదిరింపు ఎప్పుడు నెరవేరుతుందో చెప్పు" అని అంటారు. అయ్యో! ఈ అవిశ్వాసులకు ఆ సమయం గురించి కొద్దిగానైనా తెలిసి వుంటే ఎంత బాగుండును! అప్పుడు వారు అగ్ని నుండి తమ ముఖాలను గానీ తమ వీపులనుగానీ కాపాడుకోలేరు. వారికి ఎక్కడ నుంచీ సహాయమూ అందదు. ఆ విపత్తు అకస్మాత్తుగా వచ్చి పడుతుంది. అది వారిని ఎంత హఠాత్తుగా చుట్టు ముట్టుతుందంటే, వారు దాన్ని వారించనూ లేరు, వారికి ఒక్క క్షణం వ్యవధి కూడా దొరకదు. (ఖుర్‌ఆన్ 21 : 38-40)

సత్యవాగ్దానం నెరవేరే సమయం దగ్గర పడినప్పుడు, హఠాత్తుగా అవిశ్వాసుల కనుగుడ్లు విచ్చుకున్నవి విచ్చుకున్నట్లుగానే ఉండి పోతాయి. వారు ఇలా అంటారు, "అయ్యో! మా దౌర్భాగ్యం! మేము దీని విషయంలో అశ్రద్ధకు లోనయ్యాము. అంతేకాదు మేము తప్పు చేశాము". నిస్సంశయంగా మీరూ, అల్లాహ్‌ను కాదని మీరు పూజించిన మీ దైవాలూ నరకానికి ఇంధనం అవుతారు. అక్కడికే మీరు పోవలసి ఉన్నది. వారు నిజంగానే దేవుళ్ళే అయితే, అక్కడకు పోయేవారు కాదు. ఇక అందరూ శాశ్వతంగా అందులోనే ఉండాలి.

*(ఖుర్‌ఆన్ 21 : 97-99)*

చెడును తీసుకువచ్చే వారందరూ బోర్లాగా అగ్నిలో విసిరివేయబడతారు. మీరు చేసిన కర్మల ప్రకారం తప్ప మీరు మరొక విధమైన ప్రతిఫలాన్ని ఎలా పొందగలుగుతారు? *(ఖుర్ఆన్ 27: 90)*

విద్రోహ వైఖరిని అవలంబించిన వారి నివాసం నరకం. వారు దాని నుండి బయటపడదలచినపుడల్లా, అందులోకే నెట్టబడతారు. వారితో, "మీరు తిరస్కరిస్తూ ఉండే అగ్ని బాధను ఇపుడు రుచి చూడండి" అని అనబడుతుంది. *(ఖుర్ఆన్ 32 : 20)*

అవిశ్వాసానికి పాల్పడిన వారికి నరకాగ్ని ఉన్నది. వారు చనిపోవాలనే తీర్పు ఇవ్వబడదు, వారి నరక యాతనను ఏమాత్రం తగ్గించటమూ జరుగదు. ఇలా మేము అవిశ్వాసానికి పాల్పడే ప్రతి వ్యక్తికీ ప్రతిఫలం ఇస్తాము. వారు అక్కడ పెడబొబ్బలు పెడుతూ ఇలా అంటారు, "మా ప్రభూ! మమ్మల్ని ఇక్కడ నుండి బయటకు తియ్యి, మేము పూర్వం చేసిన పనులకు భిన్నంగా మంచి పనులు చేయటానికి." (వారికి ఇలా జవాబు ఇవ్వబడుతుంది) గుణపాఠం నేర్చుకోదలచినవాడు గుణపాఠం నేర్చుకోవటానికి సరిపడిన ఆయుష్షును మేము మీకు ఇవ్వలేదా? మీ వద్దకు హెచ్చరిక చేసేవాడు కూడా వచ్చి ఉన్నాడు కదా! ఇక రుచి చూడండి (యాతనను). దుర్మార్గులకు ఇక్కడ సహాయం చేసేవాడెవ్వడూ లేడు. *(ఖుర్ఆన్ 35 : 36,37)*

ఈనాడు అల్లాహ్‌కు అసత్యాన్ని ఆపాదించిన వారి ముఖాలు, ప్రళయం నాడు నల్లగా మారిపోవటాన్ని నీవు చూస్తావు. నరకంలో గర్విష్ఠులకు సరిపోయే స్థలం లేదా? *(ఖుర్ఆన్ 39: 60)*

ఈ గ్రంథాన్నీ, మేము (ఇదివరకు) మా ప్రవక్తలతో పంపిన అన్ని గ్రంథాలనూ తిరస్కరించేవారికి త్వరలోనే తెలిసిపోతుంది; అప్పుడు వారి మెడలలో కంఠపాశాలు ఉంటాయి, సంకెళ్ళు కూడా ఉంటాయి; వాటితో వారు కాగే నీటి వైపునకు ఈడ్వబడతారు.

*(ఖుర్ఆన్ 40 : 70-73)*

**జఖ్ఖూమ్ వృక్షం పాపాత్ములకు ఆహారం అవుతుంది. అది నూనె మడ్డిలాగా ఉంటుంది. సలసల కాగే నీరు మాదిరిగా అది కడుపులో మసలుతూ ఉంటుంది. అతనిని పట్టుకోండి, నరకం మధ్యకు ఈడ్చు కుంటూ తీసుకువెళ్ళండి, వాడి తల మీద సలసల కాగే నీటి శిక్షను పోర్లించండి. నీవు గొప్ప బలవంతుడవూ, గౌరవనీయుడవూ అయిన మనిషివి. మీరు ఏ విషయం రాకను గురించి సందేహించేవారో, ఆ విషయం ఇదే. *(ఖుర్ఆన్ 44 : 43-50)***

**ఈనాడు ఒక ఆటగా వితండవాదనలు చేస్తున్న సత్యతిరస్కారులకు ఆనాడు వినాశం కలుగుతుంది. ఆ రోజున వారిని కొట్టుతూ, నెట్టుతూ నరకం వైపునకు తీసుకువెళ్ళటం జరుగుతుంది. అప్పుడు వారితో ఇలా అనబడుతుంది, "మీరు తిరస్కరిస్తూ ఉండిన నరకాగ్ని ఇదే. ఇప్పుడు చెప్పండి, ఇది మంత్రజాలమా లేక మీకేమీ స్ఫురించటం లేదా? ఇక వెళ్ళండి, అందులో కాలిపోతూ ఉండండి. మీరు సహనం వహించినా, వహించకపోయినా, మీకు ఒకటే. మీరు చేస్తూ ఉండిన కర్మల ప్రకారమే మీకు ప్రతిఫలం ఇవ్వబడుతోంది."**

***(ఖుర్ఆన్ 52 : 11-16)***

ఇలా ఈ రీతిగా అల్లాహ్‌ను తలచక వారు విధించిన నియమాలను కొంచెం కూడా భయభక్తులతో ఆచరించక అవిధేయులుగా విశృంఖల జీవనం జీవించి కొద్ది పశ్చాత్తాపం కూడా లేకుండా ఆఖరి దినమున తన ముందుకు చేరు వారికి భయంకరమైన కఠిన శిక్షలు విధించకుండా వదలడు అల్లాహ్.

అధ్యాయం - 11

# ఖుర్‌ఆన్ ద్వారా ఈ బ్రహ్మాండంలో జీవించే కళ

మానవులకు మంచిని బోధించుటకై ఖుర్‌ఆన్ ద్వారా అల్లాహ్ ఈ బ్రహ్మాండం యొక్క చాలా రహస్యాలను చెప్పియున్నాడు. అవి ఏమనగా ఇప్పటికి 1400 సంవత్సరాల ముందు ఈ ప్రపంచం యొక్క భౌతిక నియమాల గురించి ఎవరికీ ఏమీ తెలియదు. అనగా ఈ బ్రహ్మాండం గురించి గాని, గెలాక్సీలు లేక పాలపుంతల గురించి గాని, నక్షత్రాల గురించి గాని, గ్రహగతుల గురించి గాని, పదార్థం గురించి గాని, భూమి యొక్క గురుత్వాకర్షణ శక్తి గురించి గాని ఎవరికి ఏ విధమైన జ్ఞానం లేదు.

కాని అల్లాహ్ వరప్రసాదమైన దివ్యఖుర్‌ఆన్‌లో ఈ రహస్యవిజ్ఞాన సూత్రాలన్నీ నింపి పంపించబడ్డాయి. వాటిని చూసి తెలుసుకుని ప్రపంచానికి తెలియజేయుటకే మనకు అల్లాహ్ చూపిన దారి ఇది అని చెప్పవచ్చు.

ఖుర్‌ఆన్ ద్వారా బ్రహ్మాండం (universe) ఒకటి కాదు, అనేకం అని ముందే తెలియజేయటం జరిగింది. ఈ రహస్యం తెలుసుకోవడానికి ఖుర్‌ఆన్‌లోని రెండు ఆయత్‌లు చదవాలి.

**భూమ్యాకాశాల సామ్రాజ్యాధిపత్యం కేవలం అల్లాహ్‌కే చెందుతుందని, ఆయన తప్ప మిమ్మల్ని సంరక్షించేవారు, మీకు సహాయం చేసేవారు మరెవ్వరూ లేరనే సంగతి మీకు తెలియదా?** ***(ఖుర్‌ఆన్ 2: 107)***

**మీపైన దృఢమైన ఏడు ఆకాశాలను నిర్మించాము.** ***(ఖుర్‌ఆన్ 78: 12)***

ఈ ఆయత్‌లలో తెలియజేయబడినది ఏమనగా ఈ ఆకాశాల, సామ్రాజ్యాల చక్రవర్తి మనకందరికీ పరమ పూజ్యుడైన అల్లాహ్‌యే అని దివ్యఖుర్‌ఆన్

తెలుపుతున్నది. ఇక్కడ ఆకాశమనగా అర్థం (Open Space, Vacuity) అనగా అంతరిక్షం. ఇక్కడ ఏడు ఆకాశాలు అనగా ఏడు శూన్యాలు. అలాగే వేరువేరు బ్రహ్మాండాలు కూడా ఉన్నాయి అన్నది ఖుర్ఆన్ తెలియజేసింది.

**మీపైన దృఢమైన ఏడు ఆకాశాలను నిర్మించాము.** ***(ఖుర్ఆన్ 78: 12)***

ఇక్కడ ఆకాశాలంటే అర్థం శూన్యం. ఆ శూన్యం క్రింద బ్రహ్మాండాలు అనగా ప్రపంచాలు (Universe) ఉన్నాయి అని అర్థం అవుతున్నది కదా. అట్లే ఖుర్ఆన్‌లో ఈ బ్రహ్మాండం యొక్క పుట్టుక ఎలా జరిగిందో తెలియజేయబడింది.

ఈ బ్రహ్మాండం లేక ఈ ప్రపంచం ఎలా పుట్టినదో అను ప్రశ్న చాలా మంది మనషుల్లో ఎప్పుడో ఒకప్పుడు కలిగియే ఉంటుంది కదా! దానికి జవాబు దివ్య ఖుర్ఆన్‌లోని 55వ సూరా 7వ ఆయత్‌లో తెలుపబడింది.

ఆ రహస్యమేమనగా, అల్లాహ్ ఆకాశాన్ని పైకి చేసి ఈ బ్రహ్మాండాన్ని దాని క్రిందుగా ఉంచి రెంటిని సమతుల్యత చేయడం జరిగిందని తెలిపింది ఖుర్ఆన్.

**ఆయన ఆకాశాన్ని పైకిలేపాడు, త్రాసును నెలకొలిపాడు.**

***(ఖుర్ఆన్ 55:7)***

ఈ బ్రహ్మాండం, ఆకాశం అమరిక యందు సైన్సుపరమైన ఈ రహస్యం దాగి ఉందని అల్లాహ్ ఈ దివ్య ఖుర్ఆన్ ద్వారా ఇలా తెలుపుతున్నాడు. అల్లాహ్ ఆజ్ఞతో అతి చిన్నదైన కణమునందు మహా విస్ఫోటనము జరిగింది. అనంతమైన శక్తి, అనంత కణాలు ఉత్పత్తి చేయబడ్డాయి. ఈ అనంత కణాలు చాలా వేగంగా బ్రహ్మాండంలోని ఎత్తుల వరకు చేరుకోవటం జరిగింది. అంటే మన అనంత కృపాళుడు అల్లాహ్ ఒక బిందువు నుంచి బ్రహ్మాండాన్ని ఉత్పత్తి చేసి అసలు గురుత్వాకర్షణ శక్తిలోని ఆకాశ, బ్రహ్మాండ కణాలలో భారం, గురుత్వాకర్షణ శక్తిని నింపి ఆకాశం తన స్థానంలోను బ్రహ్మాండం (Universe) నిలుచునట్లు చేసిన శక్తిమంతుడైన మన అల్లాహ్ రెండు ఒకదానిచుట్టూ ఒకటి పరిక్రమంలో తిరుగునట్లు చేశాడు. ఇలా అల్లాహ్ మనసులోని ఆజ్ఞలననుసరించి ఆకాశాలు 7, బ్రహ్మాండాలు 7 సృష్టించబడ్డాయి అనే అత్యంత గోప్యమైన రహస్యం మన దివ్య ఖుర్ఆన్ ద్వారా తెలుపబడుట మన అదృష్టంగా తెలుసుకుందాం.

## ఆకాశంలో నుండి నీటిని కురిపించటం

ఖుర్ఆన్‌లో చెప్పబడిన ఈ నీటి సృష్టి రహస్యం సైన్స్ ద్వారా కూడా స్పష్టీకరించబడింది. ముందుగా బ్రహ్మాండ సృష్టి జరిగాక, సూర్యుడు, గ్రహాల సృష్టి, భూ సృష్టి, అంతరిక్ష సృష్టి, నదీనదాల సృష్టి, సముద్రాల సృష్టి జరిపి ఎచటెచట నీరు, మొక్క సృష్టి అవసరమో అచట నీటిని నింపి మనకందచేసిన మహా సామ్రాట్ అయిన అల్లాహ్‌కు వినయ పూర్వక ప్రార్థనలతో మన ధన్యవాదాలు తెలుపుకుందాం.

**భూమినీ, ఆకాశాలను పుట్టించినవాడూ, ఆకాశం నుండి నీళ్ళను కురిపించినవాడూ అల్లాహ్‌యే.** ***(ఖుర్ఆన్ 14: 32)***

## భూమిపై జీవుల రక్ష కొరకు వాయు మండలానికి పైగా ఓజోన్ గేస్ యొక్క రక్షణ పొర (ఖుర్ఆన్‌లో)

దివ్య ఖుర్ఆన్ రహస్యాల గని. అది అల్లాహ్ ద్వారా సృష్టించబడి సైన్స్ కంటే ముందుగానే అందజేయబడిన రహస్యాల భాండాగారంగా ప్రతి ఒక్కరూ ఒప్పుకుని తీరవలసిన సత్యమే కదా! అల్లాహ్ మన సురక్షిత జీవన రక్షణా సరళికై ఆకాశం నుంచి మనకు హాని కలిగించుటకై పంపబడుతున్న అతినీలలోహిత కిరణాలు (Ultra Violate Rays) నుంచి మానవాళిని రక్షించుటకై ఈ ఓజోన్ వాయు పొరను ఒక గొడుగు వలె మనకేర్పాటు చేసి వున్నాడు.

**మీ కొరకు భూమిని పాన్పుగాను, ఆకాశాన్ని కప్పుగాను సృష్టించిన వాడూ, పైనుంచి వర్షాన్ని కురిపించి, తద్వారా అన్ని రకాల పంటలు పండే ఏర్పాటు చేసి మీకు ఉపాధి కల్పించినవాడూ ఆయనే!**

***(ఖుర్ఆన్ 2: 22)***

**మేము ఆకాశాన్ని ఒక సురక్షితమైన కప్పుగా చేశాము. కాని వారేమో సృష్టి యొక్క ఈ సూచనల వైపునకు తమ దృష్టినే మళ్లించరు.**

***(ఖుర్ఆన్ 21: 32)***

ఈ రక్షణ పొర వలన మానవులే కాక చెట్లు, చేమలు, వృక్షాలు, జీవజంతువులు ఎంతో హాయిగా జీవించగలుగుతున్నాయి.

విజ్ఞాన శాస్త్రం ఇంత పెరిగినప్పటికీ తిన్నగా జీవులు స్వర్గాన్ని చేరగల ఏ పద్ధతినీ కనుగొనలేదు. ఇదే విజ్ఞాన శాస్త్రానికి అల్లాహ్‌చే సృష్టి చేయబడిన దివ్య ఖుర్ఆన్‌కు మధ్య గల తేడా.

## సైన్సు- స్వర్గం

**ప్రవక్తా! ఈ గ్రంథాన్ని విశ్వసించి, (దాని బోధనలకు అనుగుణంగా) తమ నడవడికను తీర్చిదిద్దుకునే వారికి సంతోషవార్త వినిపించు; కాలువలు ప్రవహించే ఉద్యాన వనాలు వారి కొరకు సిద్ధంగా ఉన్నాయి అని. ఆ వనాలలోని పండ్లు ఆకారంలో భూలోకంలోని పండ్లను పోలి ఉంటాయి. తినటానికి ఏమైనా పండ్లు ఇవ్వబడినప్పుడల్లా, వారు "ఇలాంటి పండ్లే పూర్వం భూలోకంలో మాకు ఇవ్వబడేవి" అని అంటారు. అక్కడ వారి కొరకు పవిత్రలైన భార్యలు ఉంటారు. వారు అక్కడే శాశ్వతంగా ఉంటారు.** ***(ఖుర్ఆన్ 2 : 25)***

**"వారికి వారి ప్రభువు వద్ద లభించే ప్రతిఫలం- శాశ్వత నివాస స్థలాలైన స్వర్గవనాలు, వాటి క్రింద సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి; వాటిలో వారు కలకాలం ఉంటారు."** ***(ఖుర్ఆన్ 98: 8)***

**"అక్కడ వారు ఎట్టి శ్రమకూ గురి కారు. అక్కడి నుండి బహిష్కరింపనూ బడరు."** ***(ఖుర్ఆన్- 15: 48)***

ఖుర్ఆన్‌లోని ఈ ఆయత్‌లలో అల్లాహ్ చేసిన వాగ్దానం ప్రకారం విశ్వసించిన వారు స్వర్గంలో ప్రవేశిస్తారు. అక్కడ వారు సదా శాశ్వతంగా ఉంటారు. అక్కడ శాశ్వతంగా ఉండటమంటే అర్థం ఏమిటంటే; అక్కడ వారికి 'మరణం' అన్నది ఉండదు. స్వర్గవాసులకు వృద్ధాప్యం ఉండదు. వారికి జబ్బు చేయదు. అలాంటి స్వర్గం గురించి సైన్సులో ఉన్న లాజిక్ ఏమిటి? ప్రమాణం ఏమిటి?

పరమేశ్వరుడు పంపిన గ్రంథం ఖుర్ఆన్ తర్కం లేకుండా అంటే ప్రమాణం లేకుండా లేదు. ఇంతకుముందే నేను విన్నవించుకున్నట్లు ఖుర్ఆన్, సైన్సు ప్రకారం ఇటీవల కొంతకాలంగా శాస్త్రవేత్తలు అంగీకరించే విషయం ఏమిటంటే, బ్రహ్మాండం అంటే లోకం (Universe) అనేది ఒకటి కాదు, అనేకం ఉన్నాయి. ప్రతి బ్రహ్మాండం (లోకం)లో వేర్వేరు భౌతిక నియమాలు (Physical Law) ఉన్నాయి. ఒకటికన్నా ఎక్కువ బ్రహ్మాండాలు ఉంటాయనే దాని గురించి కొన్నేండ్ల క్రితం ఎవరూ ఆలోచించనయినా లేదు. కాగా; ఖుర్ఆన్ ఈ విషయాన్ని చాలా ముందుగానే స్పష్టం చేసింది- బ్రహ్మాండం అనేది ఒకటి కాదనీ, అవి అనేకం అనీ, ప్రతి దానికీ వేర్వేరు నియమ

నిబంధనలు ఉన్నాయని చెప్పింది. ఖుర్ఆన్‌లోని ఈ ఆయత్‌ను గమనించండి–

**"ఆయన రెండు రోజులలో ఏడు ఆకాశాలను నిర్మించాడు. ప్రతి ఆకాశంలోనూ దాని చట్టాన్ని– వహీ ద్వారా– నిర్దేశించాడు"**

***(ఖుర్ఆన్– 41: 12)***

ప్రతి ఆకాశంలోనూ దాని చట్టాన్ని (కార్యనిర్వాహక ఆదేశాన్ని) పంపినట్లు పై ఆయత్‌లో చెప్పబడింది. దీని అర్థం ఏమిటంటే, అల్లాహ్ ప్రతి ఆకాశంలో (అంటే ప్రతి బ్రహ్మాండంలో) అది పని చేసే వేర్వేరు పద్ధతులను పంపాడు. అంటే వేర్వేరు భౌతిక నియమాలను రూపొందించాడు.

దానికి సంబంధించిన ఒక ఉపమానం ఈ విశ్వంలోనే ఉంది– అదే బ్లాక్ హోల్ (ఉష్ణబిలం). బ్లాక్ హోల్‌కు ఈ విశ్వం యొక్క ఏ భౌతిక చట్టం కూడా వర్తించదు.

'స్వర్గం' ఒక వేరైన, విలక్షణమైన లోకం అనీ, దాని భౌతిక చట్టాలు మన ఈ ప్రపంచంకన్నా వేరైనవని ఖుర్ఆన్‌లో చెప్పటం జరిగింది. భౌతిక చట్టాలు వేర్వేరైన కారణంగా, ఇక్కడ అసంభవం అని మనం అనుకుంటున్నవి అక్కడ– అంటే స్వర్గంలో సంభవం కావచ్చు. అలాగే ఇక్కడ మనం సాధ్యం అని భావించేది అక్కడ అసాధ్యం కావచ్చు.

స్వర్గం రూపంలో ఉన్న ఆ విశిష్ట లోకంలోని విశిష్ట భౌతిక శాసనాల కారణంగా, ఖుర్ఆన్‌లో స్వర్గం గురించి చెప్పబడినవన్నీ సంభవమే. ఇక్కడ– ఈ ప్రపంచంలో మనకు అసంభవం అనిపించేవన్నీ స్వర్గం అనే లోకంలో సంభవం కావచ్చు. ఎందుకంటే అక్కడి భౌతిక శాసనాలు ఇక్కడి భౌతిక శాసనాలకన్నా వేరైనవి. అక్కడ మాతృగర్భం ఏ శిశువుకూ జన్మనివ్వదు. స్త్రీలకు బహిష్టు స్థితి (అశుద్ధావస్థ) ఏర్పడదు. దైవకృప వల్ల అక్కడ ప్రసాదించబడిన ఆత్మ యవ్వనమైన, సుందరమైన, ఆరోగ్యవంతమైన శరీరాకృతిని పొందుతుంది. అక్కడ ముసలితనం, అనారోగ్యం, మరణం వంటిది ఏదీ ఉండదు. అక్కడి జీవితం శాశ్వతమైనదై ఉంటుంది. అక్కడ అలసట, దుఃఖం, భయం, బాధ వంటివి కూడా ఉండవు. ప్రళయం కూడా ఈ భూమండలంలోనే, ఈ ప్రపంచంలోనే సంభవిస్తుంది. అది అక్కడ ఎన్నటికీ రాదు.

'ఆ లోకం' ఈ భూలోకవాసులకు అగోచరంగానే ఉంటుంది. అది ఎంత దూరాన ఉందంటే– మన ఈ ప్రపంచంలో నివసించేవారు సైన్సులో కోట్లాది సంవత్సరాల ప్రగతి తర్వాత కూడా– ఏ విధమైన సూక్ష్మదర్శిని ద్వారా కూడా– ఎన్నటికీ ఈ నేత్రాల ద్వారా ఆ లోకాన్ని దర్శించలేరు. ఎందుకంటే అది మన ఈ భౌతిక చట్టాలకు అందనంత దూరాన ఉంది. మన ఈ కళ్ళకు అది సదా అగోచరం (Invisible) గానే ఉంటుంది. ఆ విశిష్ట లోకం (స్వర్గం) మన ఈ ప్రపంచానికి లెక్కలేనన్ని బిలియన్ కాంతి సంవత్సరాల (Count less Billion Light Year) కన్నా దూరంగా ఉండవచ్చు.

ఇక్కడొక విషయం చెప్పుకోవాలి– మన ఈ విశ్వంలో ఉన్న సోలార్ సిస్టమ్‌ను పెద్ద తరహా సూక్ష్మదర్శినితో ఇప్పటివరకు 13 బిలియన్ల, 600 మిలియన్ల కాంతి సంవత్సరాల దూరాన ఉన్న నక్షత్రాలను మాత్రమే చూడగలిగారు. మరి ఇది ఈ బ్రహ్మాండంలోని అత్యంత చిన్న భాగం మాత్రమే.

ఇక్కడ మనం కాంతి సంవత్సరం (Light year) అని దేనినంటామో తెలుసుకోవటం కూడా అవసరమే. కాంతి లేదా వెలుతురు అనేది ఒక్క సెకనులో మూడు లక్షల కిలోమీటర్ల వేగంతో ప్రసరిస్తుంది. అంటే గంటకు ఒక బిలియన్, 80 మిలియన్ల కిలోమీటర్లు. ఒక రోజుకు 25 బిలియన్ల 920 మిలియన్ కిలోమీటర్లు. ఒక సంవత్సరంలో 9460 బిలియన్ల, 800 మిలియన్ కిలోమీటర్లు ప్రసరిస్తుంది. ఈ విధంగా ఏదయినా వస్తువు గనక కాంతికి సంబంధించిన ఈ వేగంతో ప్రసరిస్తే, నిరంతరం ఒక ఏడాది కాలంపాటు ప్రసరిస్తూ ఉంటే అది కాంతి సంవత్సరం లెక్కన 94,60,80,00,00,000 కిలోమీటర్లు అవుతుంది. ఈ ఉదాహరణ ద్వారా ఈ దూరం నేడు మన లెక్క ప్రకారం ఎంతో అంచనా వేయండి! నేడు విమానం గరిష్ట వేగం కూడా గంటకు వెయ్యి కిలమీటర్లే. ఈ వేగంతో మనం మన ఈ భూమండలంలో ఏ మూల నుండి అయినా కొన్ని గంటలలోనే ప్రపంచాన్ని చుట్టి రావచ్చు. కాని ఇదే వేగంతో మనం ఎక్కడా ఆగకుండా ఒక కాంతి సంవత్సరం దూరాన్ని చేరుకోవాలంటే, ఈ దూరం ప్రయాణించడానికి మనం పది లక్షల ఎనభై వేల ఏండ్లు పడతాయి. (అంటే ఒక మిలియన్, 80 వేల సంవత్సరాలన్నమాట!)

నేడు మనం సైన్సులో సాధించిన అభివృద్ధి లెక్కన, మనం మన పూర్తి

జీవితం కాదు కదా, కొన్ని వేల తరాల వరకు నిరంతరం నడిచినా ఒక కాంతి సంవత్సరం దూరాన్ని అధిగమించలేము. మున్ముందు వేనవేల సంవత్సరాలపాటు సైన్సులో అభివృద్ధి సాధించినప్పటికీ, ఒక మనిషి తన పూర్తి జీవిత కాలంలో రెండు మూడు కాంతి సంవత్సరాల దూరాన్ని కూడా బహుశా చేరుకోలేడేమో!? మరలాంటప్పుడు మన ఈ విశ్వంలోని 13 బిలియన్ల 60 కోట్ల కాంతి సంవత్సరాల దూరాన ఉన్న నక్షత్రం వరకు చేరుకోవటం అనేది సర్వవిధాలా అసంభవం!

సైన్సుకు సంబంధించిన ఏ భౌతిక చట్టాల ఆధారంగా మనం పనులన్నీ చేస్తున్నామో, వస్తువులన్నీ తయారు చేస్తున్నామో వీటిని మనం కనుగొనక పూర్వం లేవని కాదు. మనం సైన్సు యొక్క భౌతిక సూత్రాలను అన్వేషించామంతే. వాటిని నిర్మించలేదు సుమా! ఈ సూత్రాలు, చట్టాలన్నింటినీ అల్లాహ్ విశ్వ కర్మాగారాన్ని నిర్మించే సమయంలోనే నిర్మించాడు. ఈ విషయాన్ని ఖుర్ఆన్ ముందే చెప్పేసింది–

**“ఆయన రెండు రోజులలో ఏడు ఆకాశాలను నిర్మించాడు. ప్రతి ఆకాశంలోనూ దాని చట్టాన్ని– వహీ ద్వారా– నిర్దేశించాడు.”**

**(ఖుర్ఆన్ 41: 12)**

అందుకే–

అల్లాహ్‌యే తాను కోరినప్పుడు, తాను కోరిన మేరకు పరిజ్ఞానం కల సైంటిస్టును పుట్టిస్తూ ఉంటాడు.

మన ఈ విశ్వ మండలంలో మరో భూభాగం ఉండగలదనీ, అందులో నివసించేవారు సైన్సు రంగంలో మనకన్నా కొన్ని కోట్ల సంవత్సరాలు ముందంజ వేసి ఉండవచ్చని శాస్త్రవేత్తలంటున్నారు. (మన ఈ భూలోకంలోని సైన్సు మూడు వందల ఏండ్ల పాతది కూడా కాదన్న సంగతిని గుర్తుంచుకోవాలి. అప్పుడు మనం ఒక సైకిల్‌ని కూడా నిర్మించలేదు). దైవ కటాక్షం వల్ల వారు సైన్సులో మనకన్నా కొన్ని కోట్ల సంవత్సరాలు ముందు ఉండవచ్చు. అయినప్పటికీ వారు కాంతి వేగంతో నడవలేరు. ఎందుకంటే కాంతి వేగంతో నడవటం దాదాపు అసంభవం. ఒకవేళ కాంతి వేగంతో లేదా అంతకన్నా ఎక్కువ వేగంతో నడిచే మార్గాన్ని వారు కనుగొంటారని అనుకున్నా, అప్పటికీ ఈ అనంత విశ్వంలో ప్రతి చోటా చేరుకోవటం

ముమ్మాటికీ అసంభవమే. ఇది కేవలం దైవ శక్తికి మాత్రమే సాధ్యం.

## కొన్ని కోట్ల సంవత్సరాల తరువాత మనిషి స్వయంగా స్వర్గానికి చేరుకో గలిగేలా సైన్సు వృద్ధి చెందుతుందా? అనేది ప్రశ్న

**మొదటిది :** స్వర్గంలోకి అంటే మరో లోకంలోకి వెళ్ళే విషయమై మనం అసలు ఊహించనయినా లేము. ఎందుకంటే మనం మరో లోకంలోకి వెళ్ళడానికి, ముందుగా మన ఈ అనంత లోకంలోని హద్దులను ఎన్నటికీ దాటిపోలేము.

**రెండవది :** అసంఖ్యాకమైన బిలియన్ కాంతి సంవత్సరాల దూరాన ఉన్న విశిష్ట లోకం పరిమితులను గురించి అసలు ఊహించనయినా లేము.

**మూడవది :** ఈ లోకంలోని చట్టాలు, ఆ లోకంలోని చట్టాలు వేర్వేరుగా ఉన్నాయి. తత్కారణంగా కూడా మనం ఆ లోకంలోకి ప్రవేశించలేము.

**నాల్గవది :** భౌతిక నియమాలు వేర్వేరుగా ఉండటం వల్ల, ఈ లోకంలోని భౌతిక నియమాల ద్వారా జనించిన శరీరంతో మనం అక్కడి భౌతిక నియమాలలోకి వెళ్ళలేము. అంతేకాదు, మన ఈ కళ్ళ సాయంతో ఆ లోకాన్ని ఎన్నటికీ ఏ విధంగా కూడా వీక్షించలేము. అక్కడి జ్ఞాన విశేషాలను కూడా కొనుగొనలేము.

లెక్కలేనన్ని బిలియన్ కాంతి సంవత్సరాల దూరాన, మనకు తెలియని భౌతిక చట్టాల స్వర్గమనే లోకంలోకి ఒక్క అల్లాహ్ అద్వితీయ శక్తి మాత్రమే మనల్ని పంపగలదు. రెప్పపాటు సమయంలో పంపగలదు. ఎందుకంటే వేర్వేరు లోకాల వేర్వేరు భౌతిక చట్టాలను చేసినవాడు అల్లాహ్‌యే. ఈ నియమ నిబంధనలకు అల్లాహ్ అతీతుడు.

> **"భూమిలో, ఆకాశాలలో ఉన్న నిక్షేపాల తాళం చెవులు ఆయన వద్దనే ఉన్నాయి."** ***(ఖుర్ఆన్ 39: 63)***

ఆకాశాల వ్యవస్థపై దృష్టిని సారించినప్పుడు, దాని రచయిత అల్లాహ్ అనంత మైన గుణగణాలు, ఆయన అనంత శక్తి మన మేథకు, బుద్ధిజ్ఞానాలకు అందనిది అని ద్యోతకమవుతుంది.

**“ఆయన ఒక దానిపై ఒకటి ఏడు ఆకాశాలను సృజించాడు. నీవు కరుణామయుని సృష్టిలో ఎలాంటి క్రమరాహిత్యాన్నీ చూడలేవు. కావాలంటే మరోసారి చూడు. అందులో నీకేమైనా లోపం కనిపిస్తున్నదా? మళ్లీ మళ్లీ చూడు, నీ చూపులు అలసిపోయి విఫలమై వెనుకకు తిరిగి వస్తాయి.” *(ఖుర్ఆన్- 67: 3,4)***

దీని ద్వారానే అర్థం చేసుకోవచ్చు- వైజ్ఞానిక దృష్టి కోణంతో దీనిని చూసి, ఆలోచించినప్పుడు ఇదంతా పూర్తిగా అల్లాహ్ వ్యవహారం, ఆయనే సర్వోన్నతుడు అన్న సంగతి ఇట్టే అవగతం అవుతుంది.

**“భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తానికీ అల్లాహ్ యజమాని. అన్ని వ్యవహారాలూ అల్లాహ్ సమక్షంలోనే పెట్టబడతాయి.”**

***(ఖుర్ఆన్ 3: 109)***

అల్లాహ్ నిర్మించిన శాసనాలను, ఆదేశాలను పాలించినప్పుడే మనకు ఆయన అనుగ్రహ భాగ్యం ప్రాప్తిస్తుందని, తద్వారానే మనకు అనంతమైన దూరాన ఉన్న ఆ ప్రత్యేక లోకం- స్వర్గం-లో ప్రవేశం లభిస్తుందని బోధపడుతుంది.

## ప్రళయం (కియామత్) తథ్యం

సైన్స్ ప్రకారం, ఖుర్ఆన్ ప్రకారం కూడా ఆఖరి తీర్పు (కియామత్) దినం అన్నది తప్పక వచ్చును. ఆ రోజు ఆకాశం చిల్లులు పడును. భూమి భయంకర శబ్దాలతో కంపించును. పర్వతాలు చూర్ణము గావించబడి ధూళి రేణువుల మాదిరిగా తుత్తునియలై పోతాయి. పాపాలు, తప్పులు దైవ వ్యతిరేక కార్యాలు చేసిన వారికి ఆ దినము అత్యంత కఠినంగా గడుచును.

**తరువాత ఆకాశం బ్రద్దలై ఎర్రని చర్మం మాదిరిగా ఎర్రబడిపోయినప్పుడు (మీ పరిస్థితి ఏమవుతుంది?) *(ఖుర్ఆన్ 55 : 37)***

**జరుగవలసి ఉన్న ఆ సంఘటన సంభవించినప్పుడు, దాని సంభవాన్ని ఇక ఎవరూ తిరస్కరించలేరు. అది తారుమారు చేసివేసే ఆపద అవుతుంది. భూమి మొత్తం అప్పుడు ఒక్కసారిగా తీవ్రంగా ఊపివేయబడు**

తుంది, పర్వతాలు చెదరిపోయిన ధూళిరేణువుల మాదిరిగా తుత్తు నియలై పోతాయి. *(ఖుర్ఆన్ 56 : 1-6)*

సరే; శంఖం పూరించబడే రోజు చాలా కఠినమైన రోజు. సత్య తిరస్కారులకు అది తేలికగా ఉండదు. *(ఖుర్ఆన్ 74 : 8,9)*

ఆ తరువాత, కనుగుడ్లు తేల వేయటం జరిగినప్పుడు, చంద్రుడు కాంతిహీనుడైపోయినప్పుడు, సూర్యచంద్రులు ఒకటిగా కలిపివేయబడి నప్పుడు, ఈ మానవుడే, "ఎక్కడకు పారిపోవాలి?" అని అంటాడు. ఎన్నటికీ జరగదు, అక్కడ ఎలాంటి ఆశ్రయమూ ఉండదు.

*(ఖుర్ఆన్ 75 : 7-11)*

ఏ విషయం గురించి మీకు వాగ్దానం చేయబడుతోందో, అది తప్పని సరిగా జరగవలసి ఉన్నది. ఎప్పుడైతే నక్షత్రాల కాంతి మందగిస్తుందో, ఆకాశం చీల్చివేయడుతుందో, పర్వతాలు తుత్తునియలుగా చేయబడ తాయో *(ఆ రోజున)* *(ఖుర్ఆన్ 77 : 7-10)*

సూర్యుడు చుట్టివేయబడినప్పుడు, నక్షత్రాలు చెదరిపోయినప్పుడు, పర్వతాలు నడిపించబడినప్పుడు, పదినెలల చూలి ఒంటెలు వాటి మానాన అవి వదిలివేయబడినప్పుడు, అడవి జంతువులు ఒకచోట సమీకరించబడినప్పుడు, సముద్రాలు ప్రజ్వలింపజేయబడినప్పుడు, ప్రాణాలు (శరీరాలతో) తిరిగి కలపబడినప్పుడు, సజీవంగా పాతిపెట్ట బడిన బాలికను, నీవు ఏ తప్పు వల్ల హత్య చేయబడ్డావని అడిగి నప్పుడు, కర్మల పత్రాలు తెరువబడినప్పుడు, ఆకాశానికున్న తెర తొలగించబడినప్పుడు, నరకం మండించబడినప్పుడు, స్వర్గం దగ్గరకు తీసుకురాబడినప్పుడు- అప్పుడు ప్రతి మనిషికీ తెలిసిపోతుంది తానేమి తీసుకువచ్చాడో. *(ఖుర్ఆన్ 81 : 1-14)*

అది తన ప్రభువు ఆజ్ఞను శిరసావహించినప్పుడు, అదే (తన ప్రభువు ఆజ్ఞను శిరసావహించటమే) దాని విధ్యుక్త ధర్మం. ఓ మానవుడా! నీవు భారంగా, బలవంతంగా నీ ప్రభువు వైపునకు వెళుతున్నావు, ఆయనను కలుసుకోబోతున్నావు. ఆ తరువాత కర్మల పత్రం కుడిచేతికి

ఇవ్వబడిన వ్యక్తి నుండి తేలికపాటి లెక్క తీసుకోబడుతుంది. అప్పుడు అతను తెగ సంతోషపడుతూ తనవారి వైపునకు మరలిపోతాడు. ఇక కర్మల పత్రం వీపు వెనుక నుండి ఇవ్వబడే వ్యక్తి మాత్రం చావును పిలుస్తూ మండుతున్న అగ్నిలోకి పోయి పడతాడు.

*(ఖుర్ఆన్ 84 : 5-12)*

భూమ్యాకాశాల రూపాలను పూర్తిగా మార్చటం జరిగే రోజును గురించి నీవు వారిని భయపెట్టు. అద్వితీయుడూ, రౌద్రుడూ అయిన అల్లాహ్ ముందు అందరూ హాజరవుతారు. ఆ రోజు నీవు దోషులను చూస్తావు.

*(ఖుర్ఆన్ 14: 48)*

ఏ విషయం గురించి మీకు వాగ్దానం చేయబడుతోందో, అది తప్పని సరిగా జరగవలసి ఉన్నది. ఎప్పుడైతే నక్షత్రాల కాంతి మందగిస్తుందో, ఆకాశం చీల్చివేయబడుతుందో, పర్వతాలు తుత్తునియలుగా చేయబడ తాయో ... *(ఖుర్ఆన్– 77: 7-10)*

తరువాత ఆకాశం బ్రద్ధలై ఎర్రని చర్మం మాదిరిగా ఎర్రబడిపోయి నప్పుడు (మీ పరిస్థితి ఏమవుతుంది?) *(ఖుర్ఆన్ 55: 37)*

కనుగుడ్లు తేలవేయటం జరిగినప్పుడు, చంద్రుడు కాంతిహీనుడైపోయి నప్పుడు, సూర్యచంద్రులు ఒకటిగా కలిపివేయబడినప్పుడు, ఈ మానవుడే, "ఎక్కడకు పారిపోవాలి?" అని అంటాడు. ఎన్నటికీ జరగదు, అక్కడ ఎలాంటి ఆశ్రయమూ ఉండదు. *(ఖుర్ఆన్ 75: 7-11)*

శంఖం పూరించబడేరోజున మీరంతా గుంపులు గుంపులుగా లేచి వస్తారు. ఆకాశం తెరువబడుతుంది. అది ద్వారాలు ద్వారాలుగా మారిపోతుంది. పర్వతాలు నడిపింపబడతాయి, ఎండమావులుగా మారిపోతాయి. *(ఖుర్ఆన్ 78: 18,19)*

భూకంపం కుదిపివేసే రోజున, ఆ కుదుపు తరువాత మరొక కుదుపు; ఆ రోజున కొందరి హృదయాలు భయంతో వణుకుతూ ఉంటాయి, వారి చూపులు క్రిందికి వాలి ఉంటాయి. *(ఖుర్ఆన్ 79: 6-9)*

## అధ్యాయం - 12

# అల్లాహ్‌యే గొప్పవాడు (అల్లాహు అక్బర్)

ఇలా ఎందుకు జరుగుతుందంటే, అల్లాహ్‌యే సత్యం గనుక. అల్లాహ్‌ను కాదని వారు వేడుకునేవన్నీ అసత్యం గనుక. అల్లాహ్‌యే ఆధిక్యం గలవాడు మరియు మహోన్నతుడు. *(ఖుర్ఆన్ 22: 62)*

చూపులు ఆయనను అందుకోలేవు. ఆయన చూపులను అందుకుంటాడు. ఆయన సూక్ష్మద్రష్ట, సర్వజ్ఞాని. *(ఖుర్ఆన్ 6: 103)*

ప్రవక్తా! వారిని ఇలా అడుగు; అల్లాహ్‌ను వదలిపెట్టి, మాకు లాభం కానీ, నష్టంకానీ కలిగించలేని వారిని మేము వేడుకోవాలా? *(ఖుర్ఆన్ 6: 71)*

అతను అల్లాహ్‌ను కాదని, తనకు నష్టంగాని, లాభం గాని కలిగించలేని వారిని వేడుకుంటున్నాడు, ఇది మార్గభ్రష్టత్వానికి పరాకాష్ట. *(ఖుర్ఆన్ 22: 12)*

ఇలా చెప్పెయ్యి, ఆయన అల్లాహ్, అద్వితీయుడు. అల్లాహ్ నిరపేక్షాపరుడు ఎవరి ఆధారమూ, ఎవరి అక్కరా లేనివాడు; అందరూ ఆయనపై ఆధారపడేవారే. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన కూడా ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు. *(ఖుర్ఆన్ 112: 1-4)*

ఆయనే మీకు జీవితాన్ని ప్రసాదించాడు, ఆయనే మీకు మృత్యువును కలుగజేస్తాడు; ఆయనే మిమ్మల్ని మళ్ళీ బ్రతికిస్తాడు. నిజంగానే మానవుడు పరమ సత్యధిక్కారి. *(ఖుర్ఆన్ 22: 66)*

తెలుగు ఇస్లామిక్ ట్రస్ట్

ఆయన ఆకాశాలకూ, భూమండలానికీ సృష్టికర్త. తాను ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు, ఆయన దానిని కేవలం 'అయిపో' అని ఆజ్ఞాపిస్తాడు. అది వెంటనే అయిపోతుంది. *(ఖుర్ఆన్ 2: 117)*

కొందరు అల్లాహ్‌ను కాదని ఇతరులను ఆయనకు సమానులుగా, ప్రత్యర్థులుగా భావిస్తారు. వారు అల్లాహ్ పట్ల కలిగి ఉండవలసిన ప్రేమతో వారిని ప్రేమిస్తారు– కాని విశ్వాసులు అన్నిటికంటే అధికంగా అల్లాహ్‌నే ప్రేమిస్తారు– సర్వశక్తులూ, సర్వాధికారాలూ అల్లాహ్ గుప్పెట్లో ఉన్నాయని, ఇంకా శిక్షించటంలో కూడా ఆయన చాలా కఠినుడు అనీ ఈ దుర్మార్గులకు, మున్ముందు ఘోరశిక్షను ప్రత్యక్షంగా చూసిన తరువాత బోధపడే బదులు, ఇప్పుడే బోధపడితే ఎంత బాగుంటుంది! *(ఖుర్ఆన్ 2: 165)*

భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తానికి అల్లాహ్ యజమాని. అన్ని వ్యవహారాలూ అల్లాహ్ సమక్షంలోనే పెట్టబడతాయి. *(ఖుర్ఆన్ 3: 109)*

భూమీ, ఆకాశాల సృష్టిలో రేయింబవళ్ళు ఒకదాని తరువాత ఒకటి రావడంలో, నిలుచున్నా, కూర్చున్నా, పరుండినా అన్నివేళలా అల్లాహ్‌ను స్మరించేవారున్నూ, భూమి, ఆకాశాల నిర్మాణం గురించి చింతన చేసేవారున్నూ అయిన వివేకవంతులకు ఎన్నో సూచనలు ఉన్నాయి. (వారు అప్రయత్నంగా ఇలా అంటారు) ప్రభూ! ఇదంతా నీవు వ్యర్థంగా, లక్ష్యరహితంగా సృష్టించలేదు. నీవు పరిశుద్ధడవు కాబట్టి నిష్ఫల కార్యాలు చెయ్యవు. కనుక ప్రభూ! మమ్మల్ని నరక బాధ నుండి కాపాడు. *(ఖుర్ఆన్ 3: 190,191)*

క్షమాభిక్ష కొరకు అల్లాహ్‌ను ప్రార్థించు. ఆయన ఎక్కువగా క్షమించేవాడూ. *(ఖుర్ఆన్ 4: 106)*

ఆయనే ఆరంభమూ, ఆయనే అంతమూ; ఆయనే బాహ్యమూ, ఆయనే గూఢమూ. ఆయనకు ప్రతి వస్తువును గురించి తెలుసు. *(ఖుర్ఆన్ 57: 3)*

ఆయనే భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అధిపతి. సమస్త వ్యవహారాలు నిర్ణయ నిమిత్తం ఆయన వైపునకే తీసుకుపోబడతాయి. *(ఖుర్ఆన్ 57: 5)*

తన దాసునిపై స్పష్టమైన వాక్యాలను అవతరింపజేస్తూ ఉన్నవాడు అల్లాహ్‌యే. ఆయన వాటి ద్వారా మిమ్మల్ని చీకట్ల నుండి వెలుగులోకి తీసుకురాదలచుకున్నాడు. యథార్థం ఏమిటంటే, అల్లాహ్‌కు మీరంటే ఎంతో వాత్సల్యం, ఎంతో దయ ఉన్నాయి. *(ఖుర్ఆన్ 57: 9)*

ఆయనే అల్లాహ్; ఆయన తప్ప ఆరాధ్యుడెవ్వడూ లేడు; దృశ్యాదృశ్య విషయాలన్నీ ఎరిగినవాడు. ఆయనే కరుణామయుడు, కృపాశీలుడు. *(ఖుర్ఆన్ 59: 22)*

ఆయనే అల్లాహ్, ఆయన తప్ప ఆరాధ్యుడెవ్వడూ లేడు. ఆయన చక్రవర్తి, ఎంతో పరిశుద్ధుడు, సురక్షితుడు, శాంతిప్రదాత, సంరక్షకుడు, సర్వాధికుడు, తన ఉత్తరువులను తిరుగులేని విధంగా అమలుపరచే వాడు, ఎల్లప్పుడూ గొప్పవాడుగానే ఉండేవాడు. ప్రజలు కల్పించే దైవత్వపు భాగస్వామ్యం వర్తించని పరిశుద్ధుడు. *(ఖుర్ఆన్ 59: 23)*

అల్లాహ్, సృష్టివ్యూహాన్ని రచించేవాడు, దానిని అమలుపరచేవాడు, ఆపై దాని ప్రకారం రూపకల్పన చేసేవాడు. ఆయనకు మంచి పేర్లు ఉన్నాయి. ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న ప్రతి వస్తువూ ఆయనను స్మరిస్తోంది. ఆయన సర్వాధికుడు, వివేకవంతుడూను. *(ఖుర్ఆన్ 59: 24)*

## ఈశ్వరుడిపై సంపూర్ణ విశ్వాసియై యుండు అని ఆజ్ఞ

అంతా కలిసి అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టుకోండి. విభేదాలలో పడకండి. అల్లాహ్ మీకు చేసిన మేలును జ్ఞాపకం తెచ్చుకోండి. మీరు ఒకరికొకరు శత్రువులుగా ఉండేవారు. ఆయన మీ హృదయాలను కలిపాడు. ఆయన కటాక్షం వల్లనే మీరు పరస్పరం సోదరులయ్యారు. మీరు నిప్పుతో నిండివున్న ఒక గుండం ఒడ్డున నిలబడి ఉన్నారు. అల్లాహ్ మిమ్మల్ని దాని నుండి కాపాడాడు. అల్లాహ్ ఈవిధంగా తన సూచనలను మీకు స్పష్టం చేస్తున్నాడు, బహుశా ఈ సూచనల ద్వారా సాఫల్యం సిద్ధించే సరైన మార్గం మీకు లభిస్తుందేమో అని. *(ఖుర్ఆన్ – 3: 103)*

### ఆ సర్వేశ్వరుడైన అల్లాహ్‌ను ఉదయం, సాయంత్రం తప్పక ప్రార్థించమని ఆజ్ఞ

ప్రవక్తా! నీ ప్రభువును ఉదయమూ సాయంత్రమూ స్మరించు, లోలోపల వినయంతోనూ భయపడుతూనూ, మెల్లగా నోటితో కూడా. నిర్లక్ష్యం చేసేవారిలో నీవు చేరకు. *(ఖుర్ఆన్– 7: 205)*

### ఖుర్ఆన్ ప్రకారం దైవభీతి కలవాడే మంచి వ్యక్తి

విశ్వసించిన ప్రజలారా! మీరు గనక భయభక్తులను అవలంబిస్తే, అల్లాహ్ మీకు గీటురాయిని ప్రసాదిస్తాడు. మీనుండి మీ చెడులను దూరం చేస్తాడు. మీ తప్పులను మన్నిస్తాడు. అల్లాహ్ అత్యధికంగా అనుగ్రహించేవాడు. *(ఖుర్ఆన్ 8: 29)*

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్

## అధ్యాయం - 13

# అల్లాహ్ తన దాసుల పేదరికం దూరం చేస్తాడు

పేదరికం వల్ల కొన్ని దేవునికి వ్యతిరేకమైన పనులు, కార్యాలు చేయ వలసిరావచ్చును. ఈ ఐహిక జీవితంలో ధనం లేనప్పుడు లేదనియు, ఉన్నచో గర్వం, అహం పెరిగి దైవాన్ని మరచి దైవ వ్యతిరేక కార్యాలు చేయుట మానవుల వల్ల పరిపాటిగా జరుగుతుంది.

కాని ఖుర్ఆన్ ద్వారా మనందరి కరుణామయుడు అల్లాహ్ తెలియజేసేదే మంటే; ఎవరైతే పేదరికంలో కూడా అల్లాహ్ యందు భక్తి వీడరో, అట్టి వారి పేదరికం ఆయనయే దూరం చేసి వారికి ఏ లోటూ లేకుండా చేస్తాడు.

**ఉదాహరణ :**

> **ఒకవేళ మీకు లేమి భయం కలిగితే, అల్లాహ్ కోరితే మిమ్మల్ని తన అనుగ్రహంతో సంపన్నులుగా చెయ్యటం అసంభవం కాదు. అల్లాహ్ అన్నీ తెలిసినవాడూ వివేకవంతుడూను.** ***(ఖుర్ఆన్– 9 : 28)***

> **మీరు మీ ప్రభువును క్షమాభిక్ష కోరండి. ఆయన వైపునకు మరలిరండి. అప్పుడు ఆయన ఒక నిర్ణీత కాలం వరకూ మీకు మంచి జీవిత సామగ్రిని అనుగ్రహిస్తాడు. అనుగ్రహాలకు అర్హుడైన ప్రతి వానికీ ఆయన తన అనుగ్రహాలు ప్రసాదిస్తాడు. కాని మీరు గనక విముఖు లైతే, ఒక అతి భయంకరమైన దినం నాటి యాతనకు మీరు గురి అవుతారేమో అని నేను భయపడుతున్నాను.** ***(ఖుర్ఆన్– 11: 3)***

అధ్యాయం - 14

# ముగింపు

ముహమ్మద్! ఇలా ప్రకటించు: "మానవులారా! నేను మీ అందరి వైపునకు వచ్చిన అల్లాహ్ సందేశహరుణ్ణి. ఆయన భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువు. ఆయన తప్ప మరొక దేవుడు లేడు. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తాడు. ఆయనే మృత్యువును ఇస్తాడు. కనుక విశ్వసించండి అల్లాహ్‌ను, ఆయన పంపిన నిరక్షరాస్యుడైన ప్రవక్తను- అతను అల్లాహ్‌ను, ఆయన సూక్తులను విశ్వసిస్తాడు- అతనిని అనుసరించండి, మీరు సరియైన మార్గం పొందుతారేమో.

***(ఖుర్ఆన్ 7: 158)***

ఇవి అల్లాహ్ సూక్తులు. వాటిని మేము మీకు యధాతథంగా వినిపిస్తున్నాము. ***(ఖుర్ఆన్ 3: 108)***

మేము నిజంగా స్పష్టంగా తెలిపే వాక్యాలను అవతరింపజేశాము. ఇక రుజుమార్గం వైపునకు అల్లాహ్‌యే తనకు ఇష్టమైన వారికి దారి చూపుతాడు. ***(ఖుర్ఆన్- 24: 46)***

క్రీ.శ. 2017, జూన్ 1- హిజ్రీ. 1438, రమజాన్ 6

**Qur'an Jeene ka Kala (Telugu)** **TIP No.: 347**

## రచయిత గురించి



శ్రీ స్వామి లక్ష్మీశంకరాచార్య 1953లో ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ జిల్లాలో, బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి శ్రీ సీతారాం త్రిపాఠీ, తల్లి శ్రీమతి కౌసల్యాదేవి వృత్తిపరంగా ఉపాధ్యాయులు. స్వామిజీ విద్యాభ్యాసం కాన్పూర్, అలహాబాద్‌లలో జరిగింది. విద్యాభ్యాసం అనంతరం ఈయన కాంట్రాక్టర్‌గా స్థిరపడ్డారు. కాని కొంతకాలం తర్వాత భౌతిక జీవితాన్ని పరిత్యజించి ఆధ్యాత్మికత వైపునకు ప్రస్థానం చేశారు.

ఈలోగా ఇస్లామ్ గురించి జరుగుతున్న దుష్ప్రచారానికి ప్రభావితులై స్వామిజీ **'ఇస్లామిక్ ఆటంక్‌వాద్ కా ఇతిహాస్'** అనే పుస్తకాన్ని రాశారు. ఈ పుస్తకం ఇంగ్లీషులో **"The History of Islamic Terrorism"** అనే పేరుతో తర్జుమా అయి ముంబయి నుండి ప్రచురించబడింది. కాని తరువాత సత్యం సుబోధకం అయ్యాక స్వామీజీ తన మొదటి రచనపై విచారాన్ని వ్యక్తం చేస్తూ, "ఇస్లామ్: ఉగ్రవాదమా? ఆదర్శవాదమా?" అనే పుస్తకాన్ని రచించారు.


**TELUGU ISLAMIC PUBLICATIONS TRUST (REGD.)**
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002

ISBN : 978-93-81111-98-7



మీ సందేహాల నివృత్తికోసం ఈ రోజే మా కాల్ సెంటర్‌కు ఉచితంగా ఫోన్ చేయండి.
మా టోల్ ఫ్రీ నెంబర్:
Islamic Information Center **1800 572 3000**